# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి సంపుటి: 10 సంచిక :237 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: శనివారం 29-11-2025 పేజీలు:4 వెల: 2.00

### లీగల్ సెల్ ఏర్పాటు చేసిన పంచాయితీరాజ్ విభాగం

హైదరాబాద్,తెలంగాణ ఎన్నికల నేపథ్యంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనరేట్ చర్యలు చేపట్టింది. సర్పంచ్‌లు, వార్డు మెంబర్ల ఎన్నిక కోసం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనరేట్‌లో ప్రత్యేక లీగల్ సెల్ ఏర్పాటు చేశారు. ఈ లీగల్ సెల్‌ను ముగ్గురు సూపరిండెంట్ స్థాయి అధికారులు పర్యవేక్షిస్తుంటారు. ఎన్నికల్లో రిజర్వేషన్లను సవాలు చేస్తూ కోర్టుల్లో పలు పిటిషన్లు దాఖలైన నేపథ్యంలో లీగల్ సెల్ ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఎన్నికలు నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తిచేసే విధంగా, ఎన్నికల ప్రక్రియకు ఎలాంటి ఆటంకం కలగకుండా వెంటనే చర్యలు తీసుకునేలా జిల్లాలతో లీగల్ సెల్ సమన్వయం చేయనుంది. కేసులకు సంబంధించిన వివరాలు, సూచనలను 24 గంటల్లోపుగా అదనపు అడ్వొకేట్ జనరల్, గవర్నమెంట్ ప్లీడర్‌కి నివేదించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఎన్నికల ప్రక్రియ నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేయడంతో పాటూ కోర్టు కేసులు ఎన్నికలను ప్రభావితం చేయకుండా ఉండేందుకు ఈ ప్రత్యేక సెల్ అన్ని జిల్లాలను సమన్వయం చేస్తుంది. అలాగే ప్రతి జిల్లాలో కోర్టు కేసులను పర్యవేక్షించడానికి ప్రత్యేక అధికారిని నియమించాలని,

## కవిత రైల్ రోకో.. అరెస్టు..ఉద్రిక్తత



కామారెడ్డి : కామారెడ్డిలో జనం బాట కార్యక్రమంలో ఉన్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితను పోలీసులు అరెస్టు చేయడం ఉద్రిక్తతకు దారితీసింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డిలో కవిత జాగృతి కార్యకర్తలతో కలిసి రైలు రోకో నిర్వహించారు. రైలు పట్టాలపై బైఠాయించి నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కవిత డిమాండ్ చేశారు. కవిత రైల్ రోకో నిరసన సమాచారం అందుకున్న పోలీసులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ వెంటనే రంగంలోకి దిగి ఆమెను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. తోపులాట క్రమంలో కవిత చేతికి స్వల్ప గాయమైంది. ఈ సందర్భంగా కవిత, తెలంగాణ జాగృతి నాయకులతో పోలీసులకు మధ్య తోపులాట ఉద్రిక్తతకు దారితీసింది. అరెస్టు అనంతరం కవిత మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ఇస్తామని హామీ ఇచ్చి..ఇప్పుడు కేవలం 17 శాతం రిజర్వేషన్లతోనే పంచాయతీ ఎన్నికలకు వెళ్లడం దారుణమని విమర్శించారు. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు అమలు కాకుండా కాంగ్రెస్, బీజేపీలు అడ్డుకుంటూ కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు.

## హైదరాబాద్ కు మరో ఐకానిక్..మీర్ ఆలం ట్యాంక్ కేబుల్ బ్రిడ్జి పనులు షురూ!



హైదరాబాద్ : హైదరాబాద్ కు మరో ఐకానిక్ వంతెనగా నిలవబోతున్న మీర్ ఆలం ట్యాంక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణ పనులు మొదలయ్యాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లోని మీర్ ఆలం ట్యాంక్‌పై 2.5 కి.మీ పొడవైన వంతెనను నిర్మించాలని, దాని చుట్టూ మూడు ఐలాండ్ లను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. గార్డెన్స్ బై ది బే ప్రేరణతో అత్యంత ఆకర్షణీయంగా ఈ ఐకానిక్ వంతెన నిర్మాణాన్ని తలపెట్టారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు టెండర్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ కేఎన్ఆర్ రూ. 319.24 కోట్లకు దక్కించుకుంది. మూసీ నది పరీవాహక ప్రాంత అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ వంతెన నిర్మాణం జరగనుంది. MRDCL ఇంజనీర్లు వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. 2.5కిలో మీటర్లు పొడవు, 16.5మీటర్ల వెడల్పుతో నాలుగు వరుసలతో రోడ్డు, విశాలమైన కాలిబాటలతో వంతెన నిర్మాణం కానుంది. చింతల్‌మెట్ ప్రాంతాన్ని, శాస్త్రిపురం నుంచి సాగిపోయే బెంగళూరు జాతీయ రహదారిని కలుపుతూ ఈ వంతెన నిర్మిస్తారు. ఈ వంతెన నిర్మాణంతో నగర పర్యాటకం అభివృద్ధితో, ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం లభించనుంది. దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి మాదిరిగా రాత్రి వేళల్లో ప్రత్యేక లైటింగ్ వ్యవస్థతో మీర్ ఆలం వంతెన కూడా ఐకానిక్ బ్రిడ్జిగా శోభాయమానంగా కనబడనుంది. కేవలం రవాణా మార్గంగానే కాకుండా, నగర పర్యాటకానికి ఈ వంతెన ఒక ముఖ్య కేంద్రంగా మారబోతుంది. నిజాం సంస్థానంలో దివాన్‌గా పనిచేసిన మీర్ ఆలం బహదూర్ పేరుతో 1806లో నిర్మించబడిన మీరాఆలం చెరువు సుమారు 450 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఈ చెరువుకు ఒకవైపు నెహ్రూ జూలాజికల్ పార్క్, మరోవైపు బెంగళూరు జాతీయ రహదారి ఉన్నాయి. ఈ ప్రాంతాన్ని పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడ వంతెన నిర్మాణానికి నిర్ణయం తీసుకుంది. ఈ వంతెన పూర్తయ్యాక సందర్శకుల రద్దీ పెరుగనుందని అంచనా వేస్తున్నారు

## వెనెజువెలాలో డ్రగ్స్ నెట్‌వర్క్‌లపై చర్యలు.. డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక



వాషింగ్టన్: వెనెజువెలా కు చెందిన మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నెట్‌వర్క్‌లపై చర్యలు తీసుకోవడానికి అమెరికా సిద్ధమవుతోంది. ఈ విషయాన్ని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అతిత్వరలో వెనెజువెలా భూభాగంలో ఆపరేషన్లు చేపడతామని హెచ్చరించారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడానికి సముద్రం మీదుగా ఎన్ని చర్యలు తీసుకున్నా ఫలితం లేకుండా పోతోందని, వాటిని ఆపడానికి భూభాగంపై నుంచే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికైనా తమ దేశంలోకి మాదక ద్రవ్యాలు సరఫరా చేయడాన్ని ఆపాలని వెనెజువెలాకు మరోసారి హెచ్చరిక చేశారు. అమెరికా ఇప్పటికే కరేబియన్ సముద్రంలో భారీగా బలగాలు, యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, అత్యాధునిక ఫైటర్‌జెట్‌లను మోహరించింది. అమెరికా దళాలు జరిపిన దాడుల్లో 80 మందికిపైగా ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. తాజాగా ట్రంప్ చేసిన ప్రకటనతో ఏ క్షణమైనా అగ్రరాజ్యం వెనెజువెలా భూభాగంపై దాడిచేసే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వెనెజువెలాలో అమెరికా దళాలు చొరబడవచ్చని ప్రచారం జరుగుతోందని, వెనెజువెలా ముఠాల నుంచి మాదక ద్రవ్యాలు అమెరికాను ముంచెత్తుతున్నాయని ట్రంప్ మొదటి నుంచి చెబుతున్నారు. తాజాగా ఆ ముఠాలను అంతం చేసేందుకు సైనికదళాలను రంగంలోకి దింపారు. ఈ ముఠాలతో వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోకు కూడా సంబంధాలున్నాయని ట్రంప్ కార్యవర్గం ఇప్పటికే తీవ్ర ఆరోపణలు చేసింది. మదురో సర్కారు ఇక రోజులు లెక్కపెట్టుకోవాలని ట్రంప్ ఇటీవల స్వయంగా సోషల్ మీడియాలో హెచ్చరించారు. మదురో ఎన్నికను అమెరికా గుర్తించడం లేదని శ్వేతసౌధం ప్రెస్ సెక్రెటరీ వెల్లడించారు. దాంతో అక్కడ ప్రభుత్వాన్ని కూల్చే ఉద్దేశం కూడా ట్రంప్ కార్యవర్గానికి ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు వెనెజువెలాలోని చమురు రిజర్వులను స్వాధీనం చేసుకోవడానికే అమెరికా ఈ చర్యలు చేపడుతోందని వార్తలు ప్రచారమవుతున్నాయి.

## పిన్నెల్లి సోదరులకు సుప్రీం కోర్టులో ఎదురుదెబ్బ



న్యూఢిల్లీ,నవంబర్28: పల్నాడు జంట హత్యల కేసులో వైకాపా మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి సోదరులకు సుప్రీం కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. వారు దాఖలు చేసిన రెండు పిటిషన్లను కొట్టివేసింది. అంతేకాకుండా మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేస్తూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను అత్యున్నత న్యాయస్థానం రద్దు చేసింది. ఈ మేరకు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ఆదేశాలు జారీ చేశారు. హత్య కేసులో పిన్నెల్లి సోదరులకు ముందస్తు బెయిల్‌కు అర్హత లేదని జస్టిస్ సందీప్ మెహతా ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. అయితే సరెండర్ కావడానికి కొంత సమయం కావాలని పిన్నెల్లి తరపు లాయర్లు కోర్టును కోరారు. దీంతో సరెండర్ అయ్యేందుకు రెండు వారాల సమయాన్ని న్యాయస్థానం ఇచ్చింది. పిన్నెల్లి సోదరుల ముందస్తు బెయిల్ పిటిషన్‌పై శుక్రవారం సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. విచారణకు సహకరించాలని సుప్రీంకోర్టు చెప్పినా... సహకరించలేదని, సాక్షులను బెదిరించారని, సాక్ష్యాలు ట్యాంపర్ చేసే ప్రయత్నం చేశారని రాష్ట్ర ప్రభుత్వం కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. ఇద్దరిని చంపిన వ్యవహారంలో ముందస్తు బెయిల్ పొందేందుకు పిన్నెల్లి సోదరులకు ఏమాత్రం అర్హత లేదని జస్టిస్ సందీప్ మెహతా వ్యాఖ్యానించారు. వెంటనే అరెస్టు చేయడానికి ఎలాంటి అనుమతులు అవసరం లేదని రాష్ట్ర ప్రభుత్వానికి ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే లొంగిపోవడానికి రెండు వారాలు సమయం ఇవ్వాలని పిన్నెల్లి సోదరుల తరపు న్యాయవాదులు కోరారు. ముందస్తు బెయిల్ విషయంలో లొంగిపోయేందుకు సమయం ఎలా ఇస్తారని జస్టిస్ సందీప్ మెహతా ప్రశ్నించారు. సెక్షన్ 161 కింద నమోదు చేసిన డాక్యుమెంట్లు నిందితులకు ఎలా అందాయని ప్రభుత్వాన్ని జస్టిస్ సందీప్ మెహతా ప్రశ్నించారు. నిందితుల 161 స్టేట్‌మెంట్‌ను పోలీసులు నిందితులకే ఎలా ఇస్తారని జస్టిస్ నిలదీశారు. పోలీసులు కూడా నిందితులకు పూర్తిగా సహకరిస్తున్నట్లు ఉందని అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై కూడా పూర్తిస్థాయి దర్యాప్తు అవసరం అవుతుందేమోనని కూడా జస్టిస్ సందీప్ మెహతా అన్నారు. 161 స్టేట్‌మెంట్ కూడా తమకు అనుకూలంగా ఉందని, పోలీసుల విచారణలో పూర్తిగా సహకరిస్తున్నారని సుప్రీంకు పిన్నెల్లి సోదరుల తరపు న్యాయవాదులు తెలిపారు.

### సాయుధ పోరాటాన్ని విరమిస్తున్నాం

రాయపూర్, మావోయిస్టులు కీలక ప్రకటన చేశారు. మహారాష్ట్ర- మధ్యప్రదేశ్- ఛత్తీస్‌గఢ్ ఎంఎంసీ జోన్ ప్రతినిధి అనంత్ పేరుతో లేఖను విడుదల చేశారు. జనవరి 1న ఆయుధాలను విడిచి లొంగిపోతామని అందులో పేర్కొన్నారు. ఒక్కొక్కరు బదులుగా అందరం ఒకేసారి లొంగిపోతామని తెలిపారు. మావోయిస్టు అగ్రనేతలు మల్లోజుల, ఆశన్న లొంగుబాటు, హిడ్మా ఎన్‌కౌంటర్‌తో పార్టీ బలహీనమైందని పేర్కొన్నారు.

## పంచాయితీ ఎన్నికలకు లైన్ క్లియర్



హైదరాబాద్,నవంబర్28: పంచాయతీ ఎన్నికల నిర్వహణపై తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ దశలో ఎన్నికలపై స్టే విధించలేమని న్యాయస్థానం స్పష్టం చేసింది. సబ్ క్యాటగిరీ రిజర్వేషన్ లేనందుకు మీరు ఎన్నికలు రద్దు చేయాలని కోరుకుంటున్నారా..? అని పిటీషనర్‌ను హైకోర్టు ప్రశ్నించింది. పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ జీవో- 46పై హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. 42 శాతం రిజర్వేషన్ జీవో విచారణ సమయంలో పాత పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించాలని తామే చెప్పినట్లు హైకోర్టు గుర్తు చేసింది. గతంలో 2009లో ఇదే తరహా పరిస్థితి వచ్చినప్పుడు జీహెచ్ఎంసీ ఎలక్షన్‌ను రద్దు చేశారని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టుకు తెలపగా.. ఎలక్షన్ నోటిఫికేషన్ వచ్చాక కోర్టుల జోక్యం ఉండకూడదని ఈసీ అడ్వొకేట్ చెప్పుకొచ్చారు. అయితే, ఈ దశలో తాము ఎలాంటి జోక్యం చేసుకోలేమని మరోసారి స్పష్టం చేసింది. తామే ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించి, తామే స్టే ఎలా ఇస్తాం. అంటూ ధర్మాసనం ప్రశ్నించింది. ఈ క్రమంలో డెడికేటెడ్ కమిషన్ రిపోర్టును బహిర్గతం చేసి కాపీ ఇవ్వాలని పిటిషనర్ న్యాయవాది కోరారు. అందుకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. సబ్ కేటగిరి రిజర్వేషన్లపై కౌంటర్ దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆరు వారాల్లోపు కౌంటర్ దాఖలు చేయాలని న్యాయస్థానం హుకుం జారీ చేసింది. తదుపరి విచారణను 8 వారాలకు వాయిదా వేసింది. పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై ప్రభుత్వం జారీ చేసిన జీవో 46పై అభ్యంతరంపై వ్యక్తం చేస్తూ గురువారం వెనుకబడిన కులసంఘాలు ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశాయి. అత్యంత వెనుకబడిన కులాలకు రిజర్వేషన్లు కేటాయించాలని పిటిషనర్లు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. బీసీలలో ఏబీసీడీ వర్గాల ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. ఈక్రమంలో విచారణ చేపట్టిన హైకోర్టు.. ఎన్నికల ప్రక్రియ మొదలైనందున ఈ దశలో స్టే విధించలేమని తేల్చి చెప్పింది. నోటిఫికేషన్ వి డుదలయ్యాక ఎందుకు సవాల్ చేస్తున్నారని ప్రశ్నించింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను 8 వారాలకు వాయిదా వేసింది.

## రంగనాథ్ సార్.. ఎందుకిలా చేస్తున్నారు?



హైదరాబాద్,కీలక పదవుల్లో ఉన్నోళ్లు తాము చేసే పనుల్ని బాగా చేస్తున్నట్లుగా తమను తాము నమ్ముకోవటం బాగానే ఉంటుంది. కానీ.. అందుకు భిన్నమైన పరిస్థితులు ఏర్పడుతుంటే వెంటనే స్పందించటం.. తాను చేస్తున్న పనుల్ని సమీక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇటీవల కాలంలో తెలంగాణ రాష్ట్రంలో ఒక ఉన్నతాధికారికి లభించిన ప్రచారం.. ఫేమ్ మరెవరికీ దక్కలేదనే చెప్పాలి. ఆయనే ఐపీఎస్ అధికారి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్. రేవంత్ సర్కారు ఏర్పాటు చేసిన హైడ్రాకు కీలకంగా వ్యవహరిస్తున్న ఆయన తీరుపై మిశ్రమ స్పందనలు వినిపిస్తున్నాయి. కొందరు ఆయన తీరును అభినందిస్తుంటే.. మరికొందరు విమర్శలు చేస్తున్నారు. సామాన్య ప్రజల అభిప్రాయాన్ని పక్కన పెడితే.. హైడ్రా తీసుకుంటున్ననిర్ణయాలు.. చేస్తున్న చర్యల విషయంపై తెలంగాణ హైకోర్టు పలుమార్లు ఆగ్రహం వ్యక్తం చేయటం తెలిసిందే. కోర్టు నిర్ణయాలు.. ఆదేశాల్ని బేఖాతరు చేసినట్లుగా పేర్కొంటూ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేయటం ఈ మధ్యన ఎక్కువైంది. ఇలాంటి సందర్భాల్లో హైకోర్టు ఆదేశాలేమిట? హైడ్రా కమిషనర్ హోదాలో తానేం చేయాలన్న దానిపై న్యాయ నిపుణుల సలహాల్ని తీసుకుంటున్నారా? లేదా? అన్నదిప్పుడు ప్రశ్నగా మారింది. తాజాగా హైకోర్టు చేసిన వ్యాఖ్యలు.. ఆయనపై ప్రదర్శించిన ఆగ్రహం విషయానికి వస్తే.. బతుకమ్మ కుంట వివాదంలో డిసెంబరు 5వ తేదీ లోపు హైకోర్టు ఎదుట ప్రత్యక్షంగా హాజరు కావాలని కోర్టు నిర్ణయ తీసుకుంది. ఒకవేళ తాము చెప్పినట్లుగా స్పందిచకుంటే.. నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తామని హెచ్చరించింది. బతుకమ్మకుంటలోని ప్రైవేటు స్థలంపై హైకోర్టులో పిటిషన్ దాఖలుకాగా.. ఈ ప్రైవేటు స్థలంలో ఎలాంటి మార్పులు.. చేర్పులు చేయొద్ద ంటూఈ ఏడాది జూన్ 12న కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే.. హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను హైడ్రా కమిషనర్ ఉల్లంఘించినట్లుగా పేర్కొంటూ ఎడ్ల సుధాకర్ రెడ్డి అనే ఒకరు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై స్పందించిన హైకోర్టు.. ఈ ప్రైవేటు స్థలంలో ఎలాంటి చర్యలు తీసుకోవద్దంటూ ఏవీ రంగనాథ్ కు సూచన చేసింది. అంతేకాదు.. వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాల్సిందిగా ఉత్తర్వులు జారీ చేశారు. అయినప్పటికి హైడ్రా కమిషనర్ కోర్టుకు హాజరుకాకపోవట హైకోర్టు ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. తాజాగా జారీ చేసిన ఉత్తర్వులకు అనుగుణంగా రంగనాథ్ ఎలా రియాక్టు అవుతారన్నది ఇప్పుడు చర్చగా మారింది.

## వారి కోసమే ఇందిరమ్మ క్యాంటీన్లు: పొన్నం

హైదరాబాద్: తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వంలో హైదరాబాద్ నగరంలో ఉపాధి, ఇతర పనుల నిమిత్తం వచ్చే వారి సౌకర్యార్థం కోసం ఇందిరమ్మ క్యాంటీన్ లలో అల్పాహారం, మధ్యాహ్న సమయంలో భోజనం ఏర్పాటు చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం, కవాడిగూడ ఎన్ టిపిసి వద్ద ఇందిరమ్మ క్యాంటీన్ ప్రారంభించామన్నారు. ఈ సందర్భంగా పొన్నం మీడియాతో మాట్లాడారు. ఇంకా నగరంలో ఎక్కడెక్కడ ఇందిరమ్మ క్యాంటీన్లు అవసరముంటాయో అక్కడ ప్రభుత్వం గుర్తిస్తుందని, స్థానిక ప్రజలు, ప్రజా ప్రతినిధులు కోరిన చోట కూడా ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. ఇందిరమ్మ క్యాంటీన్ ల ద్వారా ప్రజలకు 5 రూపాయలకే నాణ్యమైన అల్పాహారం, భోజనం అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. హైదరాబాద్ లో ఉపాధి కల్పన కోసం వచ్చిన వారికి ఇందిరమ్మ క్యాంటీన్ లు ఏర్పాటు చేయడం జరుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మేయర్ గద్వాల విజయ లక్ష్మీ , రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఇతర ముఖ్య నేతలు, అధికారులు పాల్గొన్నారు.



## రాష్ట్రాల అధికారాలను హరించే విధంగా కేంద్ర విత్తన బిల్లు



హైదరాబాద్, నవంబరు28: కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన విత్తన ముసాయిదా బిల్లుపై తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను హరించే విధంగా కేంద్ర విత్తన బిల్లు ఉందని మండిపడ్డారు. ఇవాళ(శుక్రవారం) ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీలో సెంట్రల్ డ్రాఫ్ట్ సీడ్స్ బిల్లు-2025 రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడారు మంత్రి తుమ్మల. విత్తన ముసాయిదా బిల్లుపై సర్టిఫికేషన్ అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉండాలని సూచించారు. నకిలీ విత్తనాలను నియంత్రించాలంటే రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం లేకపోతే ఎలా సాధ్యమని ప్రశ్నించారు. విత్తన ముసాయిదా బిల్లుపై అభ్యంతరాలు, సవరణలు రాష్ట్ర ప్రభుత్వం తరపున పంపాలని అధికారులకు మార్గనిర్దేశం చేశారు. జిల్లాల వారీగా రైతు సమావేశాలు నిర్వహించి సంబంధిత అధికారులు అభిప్రాయ సేకరణ చేయాలని ఆదేశించారు. పంట నష్ట పరిహారం విషయంలో విత్తన ముసాయిదా బిల్లులో స్పష్టత లేదని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రభుత్వ పక్షాన కేంద్ర ముసాయిదా విత్తన బిల్లుపై అభ్యంతరాలు, సవరణలు గట్టిగానే తెలుపుతామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు.

### వేగంగా కదులుతున్న దిత్వా తుఫాన్

చెన్నై,ప్రస్తుతం శ్రీలంక తీరప్రాంతం, దాన్ని ఆనుకని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన 'దిత్వా తుఫాను' వేగంగా కదులుతోంది. ఈ వారాంతంలో ఉత్తర తమిళనాడువైపుకి కదులుతోందని, దీంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం అంచనా వేసింది. రామనాథపురం, తంజావూరు సహా ఐదు దక్షిన తీరప్రాంత, డెల్టా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

## సంపాదకీయం

**శనివారం 29-11-2025**

# రైతులను దెబ్బతీస్తున్న తుఫాన్లు !

మరో తుఫాన్ దిత్వాహ్ దూసుకుని వస్తోంది. అంది ఎంతటి బీభత్సం సృష్టిస్తుందో అన్న బెంగపట్టుకుంది. తుఫాన్లు వచ్చినప్పుడల్లా రైతన్నలు వణుకుతున్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఏ ఒక్క రైతుకు సక్రమంగా నష్టపరిహారం అందడం లేదు. అందుకే తుఫాన్లు వస్తున్నాయంటే రైతులకు కన్నీరు రావడంతో పాటు, కంటిమీద కునుకు లేకుండా పోతోంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఊకదంపుడు ఉపన్యాసాలతో రైతులను ముంచేస్తున్నారు. అటు కేంద్రం ఆలస్యంగా సర్వే బృదాలను పంపడం, వారు లెక్కలు వేసి పంపే అరకొర సాయం ఎప్పుడో రైతుల ఖాతాల్లోకి పడుతుందో తెలియని దుస్థితి ఉంది. అందుకే ఇప్పుడు పంటలను త్వరగా అమ్ముకునే దుస్థితిలో ఉన్నారు. తుఫాన్ రానుందన్న హెచ్చరికలతో ధాన్యం నూర్పి అమ్మకాలు సాగిస్తున్నారు. తీరప్రాంతం ప్రకృతి విపత్తులకు శాశ్వత కేంద్రంగా మారింది. రైతులు, వ్యవసాయ కార్మికులు, మత్స్యకారులతో పాటు వివిధ వృత్తులపై ఆధారపడే లక్షలాది మంది ప్రతి ఏటా ఏదో రకంగా నష్టపోతూనే ఉన్నారు. భౌగోళిక పరిస్థితుల కారణంగా సహజ విపత్తుల కడలిలో మనుగడ సాగించక తప్పని స్థితి దాపురించింది. ప్రతి ఏడాది రాష్ట్రంపై తుపాన్లు విరుచుకుపడుతున్నాయి. ఈ ఏడాది విరుచుకుపడిన మొంథా తుపాను కూడా తీరని నష్టాన్నే మిగిల్చింది. ఇప్పటికీ అనేకమందికి సరైన పరిహారం అందడం లేదు. ప్రభుత్వాలు ప్రకటించే సాయం అరకొరగా ఉంటున్నాయి. ఇటీవల నష్ట తీవ్రతను అంచనా వేయడానికి వచ్చిన కేంద్ర బృందానికి రైతులు ఇదే విషయాన్ని వివరించారు. తుపాన్ల కారణంగా రాష్ట్రం తరచూ ప్రభావితమౌతోందని, ముందస్తు హెచ్చరికలు చేస్తున్నా, నష్టాన్ని నివారించలేకపోతున్నామంటూ కేంద్ర బృందానికి సిఎం చంద్రబాబు కూడా చెప్పారు. పెరిగిన సాంకేతికత కారణంగా ప్రాణ నష్టాన్ని గణనీయంగా తగ్గించినప్పటికీ, పంట నష్టాన్ని, ఆస్తి నష్టాన్ని అదుపు చేయడం సాధ్యం కావడం లేదు. పైగా వాతావరణ మార్పుల కారణంగా విపత్తుల తీరు కూడా మారింది. ఊహించని చోట, ఊహించని విధంగా గంటల తరబడి కుండపోతగా వర్షం కురవడం, వాగులు, వంకలు పొంగి అనూహ్య వరదలు చోటు చేసుకోవడం, విపరీతమైన వేగంతో గాలి వీయడం వంటి వైపరీత్యాలు సాధారణంగా మారుతున్నాయి. దీంతో నష్టం భారీగా పెరుగుతోంది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది. నిజానికి మొంథా తుపాన్ ప్రభావం చాలా తీవ్రంగా ఉంది. ప్రభుత్వ లెక్కల ప్రకారమే రాష్ట్రంలోని 443 మండలాల్లోని 3,109 గ్రామాలు తుపాను బారినపడ్డాయి. దాదాపు 10 లక్షల మంది ప్రజలు తుపాను కారణంగా తీవ్రంగా ప్రభావితమయ్యారు. 1.11 లక్షల మంది నిరాశ్రయులైనారు. 1.61 లక్షల హెక్టార్లలో పంటలు నీట మునిగి, 3.27 లక్షల మంది రైతులు నష్టపోయారు. ప్రభుత్వ ఆస్తులకు జరిగిన నష్టమూ ఉంది. అయితే, ప్రభుత్వం రూపొందించిన ఈ లెక్కల మీద కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవలి మొంథా తుపాను కారణంగా రాష్ట్రంలో 6,384 కోట్ల రూపాయల నష్టం సంభవించినట్లు రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది. ఈ మేరకు రూపొందించిన నివేదికలో వ్యవసాయం, మత్స్యకార, చేనేత, పశుసంవర్థక రంగాలతో పాటు విద్యుత్, రహదారులు, ఇళ్లు, విద్యా సంస్థలు తీవ్రంగా దెబ్బ తిన్నట్లు ప్రభుత్వం పేర్కొంది. తక్షణ సాయంగా 2,622 కోట్ల రూపాయలు విడుదల చేయాలని, తీరప్రాంతంలో సముద్ర కోత నివారణ పనుల కోసం ఉప్పాడకు రూ.323 కోట్లు, విశాఖ సమీప ప్రాంతాలకు రూ.203 కోట్లు, శ్రీకాకుళం ప్రాంతానికి రూ.98 కోట్లు మంజూరు చేయాలని కేంద్రాన్ని రాష్ట్రం కోరింది. పంటల బీమా లేకపోవడంతో నష్టాన్ని ఉద్దేశపూర్వకంగానే తగ్గించి చూపుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్యూమరేషన్ సమయంలో తమను విస్మరిస్తున్నారంటూ కౌలు రైతులు అనేకచోట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశాలను కూడా పరిగణలోకి తీసుకుంటే నష్ట తీవ్రత మరింతగా పెరిగే అవకాశం ఉంది. గతంతో పోలిస్తే నష్టం అంచనా కోసం కేంద్ర బృంద త్వరగా పర్యటించి, అంచనాలు వేసినా అవి డబ్బురూపంలోకి వచ్చేది ఎప్పుడో చెప్పలేం. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి కేంద్రం సానుకూలంగానే స్పందించిది. అయితే, ఇదొక్కటే చాలదు. కేంద్ర బృందం పర్యటించినంత మాత్రాన నిధులు ఇచ్చినట్లు కాదు. కష్టకాలంలో రాష్ట్రాన్ని ఆదుకోవాలన్న చిత్తశుద్ధి కేంద్రానికి ఉండాలి. విపత్తుల సమయంలో నష్టపోయిన రైతులకు తక్షణ సాయం అందించే వ్యవస్థ రావాలి. అత్యవసర సాయం కింద ఎంతో, కొంత నిధులు వెంటనే ఇచ్చేలా ఏర్పాటు చేయాలి. ఈ నేపథ్యంలో విపత్తు అంచనాలు లెక్కకట్టేందుకు వచ్చే కేంద్ర బృందం పర్యటన తరువాతైనా కేంద్రం ఉదారంగా స్పందించాలి. రాష్ట్ర ప్రభుత్వం అడిగిన తక్షణ సాయాన్ని వెంటనే విడుదల చేయడంతో పాటు, పూర్తిస్థాయి పరిహారాన్ని సాధ్యమైనంత త్వరగా విడుదల చేయగలగాలి. హుద్‌హుద్ తుపాన్ సందర్భంలో కేంద్ర ప్రభుత్వం చూపిన నిర్లక్ష్యాన్ని రాష్ట్ర ప్రజలు మరచిపోలేదు. అటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం చూసుకోవాలి. అదే సమయంలో రైతులు, కౌలురైతులతో పాటు నష్టపోయిన ప్రతి ఒక్కరికి న్యాయం చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే! ఆ మేరకు అవసరమైతే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి సిద్ధపడాలి. అలాగే ఇందుకోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకుని రావాలి. ప్రత్యేక నిధి ఉంటే తుపాన్ల సమయంలో నష్టపోయిన రైతులకు, ప్రజలను తోణం అదుకునే వీలుంటుంది.

# పదవుల పోరులో రైతులకు దిక్కెవరు?



హైదరాబాద్,కర్ణాటకలో ప్రజా సమస్యల పరిష్కారం కన్నా పదవుల కోసం ఆరాటమే ప్రధానంగా కనిపిస్తోంది. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి కుర్చీ కోసం రెండు వర్గాల మధ్య అంతర్గత పోరు ఆగడం లేదు. ఒకపక్క ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మరోవైపు డిప్యూటీ సిఎం డికె శివకుమార్ మధ్య అధికార పంపిణీ ఫార్ములాపై గందరగోళం నెలకొంటోంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా డికె శివకుమార్‌ను బుజ్జగించడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ రాజకీయ సంక్షోభం ఎలా ఉన్నా రాష్ట్రంలోని ఎన్నో సమస్యలు ఎక్కడవేసినగొంగళి అక్కడే అన్నట్టు ఉంటున్నాయి. ముఖ్యంగా మొక్కజొన్నకు కనీస మద్దతు ధర కల్పనలో రైతుల డిమాండ్ ఇప్పుడు తీవ్ర సమస్యగా ఉంటోంది. ఈ విషయంలో విపక్షం బిజెపి నేతలు రాష్ట్ర ప్రభుత్వం రైతు వ్యతిరేకి అని చిత్రించడానికి ప్రయత్నిస్తున్నారు తప్ప కేంద్ర అధిష్ఠానంతో ఈ సమస్యల పరిష్కారానికి చర్చించేందుకు ధైర్యం వహించడం లేదు. మొక్కజొన్న పంటకు కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 3000 కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఉత్తర కర్ణాటకలోని గడగ్ జిల్లా రైతులు గత పదిరోజులుగా నిరవధిక దీక్ష సాగిస్తున్నారు. పొరుగు జిల్లాల రైతులు కూడా వీరికి మద్దతుగా దీక్షలు ప్రారంభించారు.కర్ణాటకలో ఇదివరకు క్వింటాలు మొక్కజొన్నకు కనీస మద్దతు ధర రూ. 1600 నుంచి రూ. 1800 వరకు ఉండగా కేంద్ర ప్రభుత్వం రూ. 2400 వరకు కనీస మద్దతు ధరను నిర్ణయించింది. సెప్టెంబరు నుంచి ఈ ధరలు తగ్గుముఖం పట్టడం ప్రారంభమై గత పదిహేను రోజుల్లో అకస్మాత్తుగా మరింత తగ్గిపోయాయి. వరదలవల్ల దెబ్బతిన్న పంటల నుండి ఇప్పుడిప్పుడే రాష్ట్రం తేరుకొంటున్న పరిస్థితుల్లో మొక్కజొన్న రైతుల నిరసన ప్రారంభం అయింది. చెరకు పంటకు టన్ను ఒక్కంటికి న్యాయమైన, లాభదాయకమైన ధర రూ. 3500 వంతున చెల్లించాలని చెరకు రైతులు దీక్షలు చేపట్టిన తరువాత మొక్కజొన్న రైతుల దీక్షలు ప్రారంభమయ్యాయి. చెరకు టన్నుకు రూ. 3300 వంతున చెల్లిస్తామని కర్ణాటక ప్రభుత్వం ఇటీవలనే చెరకు రైతులను ఒప్పించగలిగింది. త్వరలో శీతాకాల అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న తరుణంలో విపక్షం బిజెపి ఈ రైతుల నిరసనలను ఒక అవకాశంగా చేసుకుని అధికార పార్టీ ప్రధాన స్వభావం రైతులకు వ్యతిరేకం అని చిత్రించడానికి సిద్ధంగా ఉంది. మొక్కజొన్న, చెరకు రైతుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వమే చొరవతీసుకోవాలని అధికార పార్టీ కాంగ్రెస్ వాదిస్తోంది.కేంద్రంలో తమ పార్టీ నాయకుల వద్ద ఈ అంశాన్ని లేవనెత్తడానికి విపక్ష బిజెపి ఎంపిలకు ధైర్యం లేదని కాంగ్రెస్ ఎగతాళి చేస్తోంది. మొక్కజొన్న, పెసలు ధరలు పతనమవుతున్నందున వీటి ప్రొక్యూర్‌మెంట్ విషయంలో జోక్యం చేసుకోవాలని అభ్యర్థిస్తూ ప్రధాని నరేంద్ర మోడీకి రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య గత వారం లేఖ రాశారు. ధర మద్దతు స్కీమ్ లేదా మరో అనువైన వ్యవస్థ ద్వారా తక్షణం ప్రొక్యూర్‌మెంట్‌ను ప్రారంభించేలా నేషనల్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(నాఫెడ్), నేషనల్ కో ఆపరేటివ్ కన్సూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌సిసిఎఫ్) లను ప్రధాని మోడీ ఆదేశించాలని కోరారు. విదేశాల నుంచి ఈ పంటల దిగుమతులు పెంచడం కూడా ఈ సంక్షోభానికి కారణంగా ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య వాదిస్తున్నారు. దీనికి స్పందనగా కేంద్ర వినియోగదారుల వ్యవహారాల, ఆహార,ప్రజా పంపిణీ కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి తన లేఖ బంతిని రాష్ట్ర ప్రభుత్వ కోర్టులోకే విసిరారు. కనీస మద్దతు ధర లేదా లాభదాయక, న్యాయమైన ధర కల్పన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.దిగుమతులే ఈ సంక్షోభానికి కారణమన్న సిద్ధరామయ్య వాదనను తోసిపుచ్చారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కేవలం 0.5 లక్షల మెట్రిక్ టన్నులే దిగుమతులు అయ్యాయని సమాధానం ఇచ్చారు. కేంద్ర, రాష్ట్రాల రాజకీయ నిందారోపణల డ్రామా ఫలితంగా రైతుల ప్రధాన సమస్యలు పరిష్కారం కాకుండా మరుగున పడిపోతున్నాయి. కర్ణాటకలో మొక్కజొన్న సాగు విస్తీర్ణం బాగా పెరిగింది. మార్కెట్ నిపుణుల అంచనాల ప్రకారం ఈ ఏడాది సరఫరా డిమాండ్ మధ్య వ్యత్యాసం, ప్రపంచ తృణధాన్యాల ధరల అస్థిరత, తదితర అనేక కారణాల వల్ల ధరలు బాగా దిగజారాయి. ఈథనాల్ బ్లెండింగ్ ఫలితాలు కూడా అనుకున్న విధంగా రాలేదు. ఫలితంగా మొక్కజొన్న మార్కెట్ తీవ్ర ఒడిదుడుకులకు గురవుతోంది. 2025 ఖరీఫ్ సీజన్‌లో కర్ణాటకలో 55 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న ఉత్పత్తి కాగా, 32 లక్షల టన్నుల వరకు మార్కెట్ చేయగల అత్యధిక మిగులు స్థాయిలో మొక్కజొన్న ఉంది.ఇది స్థానిక పరిశ్రమల శోషణ సామర్థ్యాన్ని మించి పోయింది. అంటే స్థానిక పరిశ్రమల అవసరాలకు మించి ఉంది. ఇదివరకటి సంవత్సర ప్రొక్యూర్‌మెంట్‌తో డిస్టిలరీల్లో ప్రస్తుతం ఉన్న అదనపు నిల్వలతో ఇప్పుడు ఈ పంటను తీసుకోవడం చాలా సమస్యగా తయారైంది. ఈ సంక్షోభంలో కనీస మద్దతు ధర కింద రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్న పంట ప్రొక్యూర్‌మెంట్ చేస్తుందని ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య సానుకూలంగా హామీ ఇచ్చినప్పటికీ ఇంకా కార్యరూపం దాల్చలేదు. ఈ మేరకు ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడ లేదు. ఇథనాల్ ఉత్పత్తికి మొక్కజొన్న వినియోగించేందుకు నాఫెడ్, ఎన్‌సిసిఎఫ్‌లతో ఒప్పందం కుదుర్చుకోవాలని రాష్ట్రం లోని డిస్టిలరీలకు ఆయన లిఖిత పూర్వకంగా సూచించినా, ఇంకా పనులు జరగడం లేదు. కర్ణాటకలో ముఖ్యంగా సెంట్రల్, ఉత్తరాది జిల్లాల్లో అత్యధికంగా మొక్కజొన్నను పండించిన రైతులు తమ సమస్యల పరిష్కారానికి సుదీర్ఘ ప్రణాళికతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రావాలని డిమాండ్ చేస్తున్నారు. కానీ ఈ డిమాండ్ అధికార, విపక్ష నాయకుల నిర్వాకంతో నెరవేరే అవకాశం కనిపించడం లేదు.

# ఓటరు అభివృద్ధికి దిక్సూచిగా ఉండాలి



హైదరాబాద్,తెలంగాణ ప్రభుత్వం ఎట్టకేలకు నవంబర్ 25, 2025 న గ్రామ పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చి 12,728 గ్రామాలలో నూతన సర్పంచులను ఎన్నుకునేందుకు డిసెంబర్ 11, 13, 17న మూడు విడుతలలో ఎన్నికలను నిర్వహించేందుకు సిద్ధమైంది. ఈ ఎన్నికలో భాగంగా వివిధ గ్రామాలలో జరగబోతున్న పరిణామాలు, వాటి తీరు సగటు మానవున్ని ఒకింత ఆశ్చర్యానికి గురిచేస్తుందని చెప్పవచ్చు. మిగతా ఎన్నికలతో పోలిస్తే పంచాయతీ ఎన్నికలు ప్రత్యేకం. ఎందుకంటే గ్రామాలలో 500 నుండి 25,000 జనాభాకు 5 నుండి 21 వార్డులుగా విభజింపబడి ఉంటుంది. పంచాయతీ రిజర్వేషన్ ప్రకారం ఇప్పటికే ఆశావహులు ఓటరు జాబితా ముందర పెట్టుకొని ప్రచారం చేసుకుంటూ, తమ ఓట్లను లెక్కబెట్టుకుంటూ తమ గెలుపు కోసం ఏమేమి చేయాలో, ఎలా చేయాలో విశ్లేషణతో ఒక అంచనా వేసుకుంటుంటారు. గ్రామాలలో కొంత మంది ఒక వర్గానికి బహిరంగంగా మద్దతునిస్తూ ప్రచారంలో సైతం పాలుపంచుకుంటారు. ఇలాంటి వాళ్ళతో అభ్యర్థులకు ఎలాంటి అనుమానం లేదు.అయినప్పటికీ అభ్యర్థులు వారికి వివిధ ప్రోత్సాహకాల ఆశజూపో, ఇంకేమైనా అవకాశాలు కల్పించో, రహస్యంగా మంతనాలు జరుపుతూ, తమవైపుకు తిప్పుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. మరొక వర్గం బరిలోనున్న అందరితో మంచిగా నడుచుకుంటూ ఎవ్వరు వచ్చి ఓటు అడిగిన సరేనని తలఊపుతూ వుంటారు. వీరు ఎవ్వరికి ఓటు వేస్తారో తెలుసుకోలేక అభ్యర్థులు తలలు పట్టుకుంటారనడంలో ఎలాంటి అనుమానం అక్కర్లేదు. వీరిని తమవైపు తిప్పుకోవడానికి బహుమతులను, వివిధ రకాల హామీలిస్తూ, విందు వినోదాలతో ఎక్కువ సమయం గడుపుతుంటారు. అలా గడిపి హమ్మయ్యా! వీరి ఓట్లను సాధించాను అనుకునేలోపే మరుసటి రోజు మరొక అభ్యర్థితో రహస్యంగా ఇలాంటి తంతే జరుగుతుంది. ఒకవేళ తెలిసి ఏం ఇలా జరిగిందని ప్రశ్నిస్తే? నా ఓటు నీకే కానీ! అతను పిలిస్తే వెళ్ళాను, ఏదో అలా వారు చెప్పింది విని వచ్చానని చెప్పడం, అభ్యర్థులు వీళ్ళలాంటి ఓటర్లవల్ల తలలు పట్టుకోని, ఎటూ తేల్చుకోలేక మదనపడుతుంటారనడంలో ఎలాంటి అవాస్తవం లేదు. ప్రత్యేకంగా గ్రామాలలో ఒక వింత ఆచారం కొనసాగుతుంది.
ఓట్లకోసం ప్రమాణాలు చేయించడం, వివిధ దేవుళ్లపై ఒట్లు పెట్టించడం, డబ్బులు పంచడం, మద్యం పంచడం లాంటివి చేస్తుంటారు. ఒక అభ్యర్థి గెలవడానికి పెట్టే మొత్తం ఖర్చులో సగానికిపైగా మద్యం కోసం పెడుతున్నారన్నా ఆశ్చర్యపోనక్కరలేదు. ఇలాంటి పరిస్థితి కేవలం గ్రామాలల్లో జరుగుతుందని తేలికగా తీసివేయడానికి వీలులేదు. గ్రామాలలో సైతం ఉన్నత చదువులు చదివిన యువత ఉండికూడా ప్రజలలో మార్పును తీసుకరాకపోవడానికి గల కారణాలను విశ్లేషిస్తే, అన్నీ విషయాలలో సంపూర్ణ జ్ఞానమున్నవారే ఈ అలవాటుకు కారకులవుతున్నారన్నది ముమ్మాటికీ నిజం. స్వాతంత్ర్యానికి ముందు ఎంతోమంది స్వాతంత్ర్య సమర యోధులు ఎన్నో అష్టకష్టాలు పడి, నిస్వార్థంతో, తమ ప్రాణాలను సైతం దేశానికి అంకితంచేసి స్వాతంత్ర్యాన్ని తెచ్చిపెట్టి, అట్టడుగు వర్గాలు, బడుగు, బలహీన వర్గాల వారికీ లబ్ధి చేకూర్చాలని, రాజ్యాంగం రచించి, ప్రతి పౌరుడికీ రాజ్యాంగబద్ధంగా ప్రజాస్వామ్యంలో ఎన్నిక కావడానికి వీలు కల్పిస్తే, ఈ రోజు మనం ఏం చేస్తున్నాం? పేదవారు ఇంకా బలవంతుల కింద బలహీనులుగానే వుంటున్నారంటే కారణం వారిలో చైతన్యం లేకపోవడమేనా? మద్యానికి, డబ్బులకు ఆశపడితే అభివృద్ధికి మరో ఐదేళ్ళు వేచి చూడాల్సిందే. పాలకులను ధైర్యంగా అడగలేని పరిస్థితి ఏర్పడి, ఎలాంటి అభివృద్ధి ఫలితాన్ని పొందలేని పరిస్థితిని కొని తెచ్చుకున్నట్లు కాదా? నేను నా దేశ ప్రజలకు కత్తి చేతికి ఇవ్వలేదు. ఓటు హక్కు ఆయుధంగా ఇచ్చాను. పోరాడి రాజులవుతారో.. అమ్ముకుని బానిసలవుతారో అది వారిచేతుల్లోనే ఉంది అని ఏనాడో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సెలవిచ్చారు. అలాగే గుడ్లగూబ పగల చూడలేదు, కాకి రాత్రి చూడలేదు. ఓటును అమ్ముకునే ప్రజలు ప్రగతిని, ప్రజాస్వామ్యాన్ని చూడలేరని అబ్దుల్ కలాం చెప్పారు. ఓటరు అంటే అభివృద్ధికి దిక్సూచి. అది ఎప్పుడు జరుగుతుంది? ఓటరు ఎలాంటి ప్రోత్సాహకాలను ఆశించకుండా, నిష్పక్షపాతంగా ఉంటూ, ఓటు విలువను పలువురికి తెలియజేస్తూ, ప్రోత్సహిస్తూ, అభివృద్ధికి పాటుబడే అభ్యర్థి పక్షాననిలిచి, బలపరుస్తూ విజయంలో కీలకపాత్ర వహించి, గెలుపుకు పాటుబడుతూ ఆ తర్వాత కావల్సిన అభివృద్ధిని చేయించుకోవడానికి, ప్రశ్నించడానికి ప్రతి ఒక్కరికీ ధైర్యంగా ఉంటుంది. కావున ప్రతిఒక్కరూ ఆ విధంగా ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

# మహబూబ్ పట్నం పంచాయతీ ఎన్నికపై స్టే

మహబూబాబాద్,మహబూబాబాద్ జిల్లా మహబూబ్ పట్నం గ్రామ పంచాయతీ ఎన్నికలపై తెలంగాణ హైకోర్టు స్టే విధించింది. ఆరుగురు ఓటర్లు ఉన్న ఎస్టీలకు ఒక సర్పంచ్, మూడు వార్డు స్థానాలు ఎలా రిజర్వ్ చేశారంటూ హైకోర్టు.. ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. మహబూబ్ పట్నంలో మూడు ఎస్టీ కుటుంబాలకు చెందిన ఏడుగురు ఓటర్లు ఉన్నారు. వీరికి సర్పంచ్‌తో పాటు మూడు వార్డులు కూడా కేటాయించారు. ఈ రిజర్వేషన్లు మార్చాలని గ్రామానికి చెందిన యాకూబ్, శ్రీకాంతాచారి, లింగయ్య, విజయ్, వెంకటమల్లు, పోలు నాగయ్య తదితరులు బుధవారం హైకోర్టును ఆశ్రయించారు. గతంలో మహమూద్‌పట్నం గ్రామ పంచాయతీ నుంచి తండాలను వేరు చేసి కొత్త పంచాయితీలు ఏర్పాటు చేశారని, దీంతో ఆ గ్రామంలో 576 ఓట్లు ఉన్నట్లు పిటిషనర్లు కోర్టుకు తెలిపారు. 199 మంది ఎస్సీలు, 358 మంది బీసీలు, 13 మంది ఓసీలు, ఏడుగురు ఎస్టీలు ఓటు హక్కును కలిగి ఉన్నారని చెప్పారు. అయితే 2011 జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్లు కల్పించడంతో సర్పంచ్ స్థానంతో పాటు 3 వార్డులు దక్కాయి. దీనిపై హైకోర్టును ఆశ్రయించడంతో ఎన్నికలను రద్దు చేస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని కిష్టాపురం గ్రామ సర్పంచ్‌గా కొండం రంగారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామ సర్పంచ్‌తో పాటు 8 మంది వార్డ్ మెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొండం రంగారెడ్డి బ్రదర్స్ గ్రామానికి అనేక సేవా కార్యక్రమాలు చేశారు. దీంతో ఆ గ్రామస్తులంతా ఏకమై పార్టీలకతీతంగా సర్పంచ్‌గా రంగారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# మర్డర్‌ను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరణ

గద్వాల,ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన ఓ మాజీ సర్పంచ్ కేసును పోలీసులు ఛేదించారు. ఇది హత్యగా ధృవీకరించారు. ఓ పక్కా ప్లాన్ ప్రకారం మాజీ సర్పంచ్‌ను మట్టుపెట్టారని గుర్తించారు. బొలెరో వాహనం వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ మాజీ సర్పంచి ఇటీవల ప్రాణాలు కోల్పోయారు. అంతా రోడ్డు ప్రమాదమని భావించారు. కుటుంబ సభ్యులు మాత్రం ప్రణాళిక ప్రకారం చేసిన హత్యగా అనుమానించి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు దర్యాప్తు చేపట్టి వారం రోజుల్లో కేసును ఛేదించారు. పైకి కనిపిస్తున్నట్లు అది ప్రమాదం కాదని.. రూ.25 లక్షలు సుపారీ ఒప్పందం కుదుర్చుకుని, నెల రోజులు రెక్కీ నిర్వహించి.. పక్కా ప్రణాళిక ప్రకారం చేసిన హత్యగా నిర్ధరించారు. జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం నందిన్నె మాజీ సర్పంచి చిన్నభీమ రాయుడిని సుపారీ గ్యాంగ్‌తో హత్య చేయించడం జిల్లాలో సంచలనం రేపింది. కేసు వివరాలను జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈనెల 21న నందిన్నె మాజీ సర్పంచి చిన్నభీమ రాయుడు ద్విచక్ర వాహనంపై గద్వాల నుంచి సొంతూరు నందిన్నెకు బయల్దేరారు. వెనుక నుంచి వచ్చిన బొలెరో ఆయన్ను బలంగా ఢీకొట్టింది. కొద్ది దూరం వాహనం సహా లాక్కెళ్లింది. ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. బొలెరో ముందు భాగంలో బైక్ ఇరుక్కు పోయింది. దీంతో డ్రైవర్ సహా.. అందులో ఉన్నవారంతా పరారయ్యారు. ఈ ఘటనను తొలుత ప్రమాదంగా భావించారు. కానీ, కుటుంబ సభ్యులు మాత్రం ప్రమాదం జరిగిన తీరు చూసి ఉద్దేశ్య పూర్వకంగానే ఢీ కొట్టారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసిన పోలీసులు వారం రోజుల్లో ప్రమాదం వెనక మిస్టరీని ఛేదించారు. రూ.25లక్షల సుపారీ కుదుర్చుకుని పక్కా ప్రణాళిక ప్రకారం చేసిన హత్యగా పోలీసులు నిర్ధరించారు. నందిన్నె గ్రామానికి చెందిన మిల్లు వీరన్న అలియాస్ కురువ వీరన్నకు.. మృతుడు చిన్నభీమ రాయుడికి మధ్య భూ వివాదాలు, రాజకీయ కక్షలు ఉన్నాయి. వీరన్న రైస్ మిల్లులో అక్రమాలపై అధికారులు సోదాలు నిర్వహించి కేసు నమోదు చేశారు. దీంతో చిన్నభీమ రాయుడిపై వీరన్న మరింత కక్ష పెంచుకున్నాడు. ఆయన్ను హత్య చేయించేందుకు కర్నూలుకు చెందిన ఈశ్వరయ్య గౌడ్‌తో రూ.25 లక్షలు సుపారీ ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. హత్యచేసి దాన్ని ప్రమాదంగా చిత్రీకరిస్తే నేరం తమపైకి రాకుండా ఉంటుందని ప్రణాళిక రచించాడు. నెలరోజులు రెక్కీ నిర్వహించారు. నాలుగ్గుసార్లు హత్యాయత్నం చేసినా.. పరిస్థితులు అనుకూలించలేదు. ఈ నెల 21న అదునుచూసి జాంపల్లి బస్టాండ్‌కు సమీపంలో చిన్నభీమ రాయుడు బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టారు. చనిపోయాడని నిర్ధరించుకునే వరకూ బైక్ సహా ఈడ్చుకెళ్లారు. బైక్ ముందు భాగంలో ఇరుక్కుపోవడంతో అక్కడే వదిలేసి పరారయ్యారు. ఈ కేసులో మిల్లు వీరన్న సహా 10మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.

# శ్రీలంక తీరంలో కేంద్రీకృతమైన తుపాన్

విశాఖపట్నం, నైరుతి బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న శ్రీలంక తీరంలో తీవ్ర వాయుగుండం.. తుపానుగా మారిందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈ తుపానుకు 'దిత్వాహ్'గా యెమన్ దేశం నామకరణం చేసినట్టు అధికారులు తెలిపారు. ఉత్తర తమిళనాడు-పుదుచ్చేరికి ఆనుకుని ఉన్న దక్షిణ కోస్తా తీరం వైపు గడిచిన 6 గంటల్లో గంటకు 15 కి.మీ వేగంతో తుపాను కదులు తోందని పేర్కొన్నారు. దిత్వాహ్ తుపాను శ్రీలంక ట్రింకోమలీకి 200 కి.మీ, పుదుచ్చేరికి 610 కి.మీ, చెన్నైకి ఆగ్నేయంగా 700 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఆదివారం తెల్లవారుజామున నైరుతి బంగాళాఖాతం ఆనుకుని తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణకోస్తా తీరాలకు చేరే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. దీంతో రాష్ట్రంలోని అన్ని ఓడరేవుల్లో రెండో నంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఈనెల 30న ప్రకాశం, నెల్లూరు, కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో అత్యంత భారీ వర్షం కురిసే అవకాశముందని రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఆయా జిల్లాల్లో 20 సెం.మీకు పైగా వర్షపాతం నమోదయ్యే అవకాశముందని విపత్తు నిర్వహణ సంస్థ అధికారులు తెలిపారు. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరించారు. రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.శ్రీలంకను అనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో తుఫాన్ ఏర్పడింది. ఈ మేరకు విశాఖపట్నంలోని తుఫాన్ హెచ్చరికల కేంద్రం ఉన్నతాధికారి జగన్నాథ కుమార్ వెల్లడించారు. ఈ తుఫాన్ కారణంగా రానున్న వారం రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు కురుస్తాయని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు.. మరికొన్ని ప్రదేశాల్లో భారీ వర్షాల నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ సమయంలో తీరం వెంబడి గరిష్టంగా 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందన్నారు. కాబట్టి సముద్రంలో వేటకు వెళ్ళ వద్దని మత్స్యకారులను హెచ్చరించారు. తీరం వెంబడి ఉన్న పోర్టులో రెండో నెంబరు ప్రమాద హెచ్చరికను జారీ చేశామని జగన్నాథ కుమార్ వివరించారు. ఇక దిత్వా తుఫాన్ కారణంగా.. శనివారం నుంచి సోమవారం వరకు అంటే.. నవంబర్ 29 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు భారీ వర్షాలు కురుస్తాయిన అంచనా వేస్తున్నారు. 29వ తేదీన అన్నమయ్య, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. ఇక 30వ తేదీన నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, ప్రకాశం, వైఎస్ఆర్ కడప జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. తెలంగాణలో పూర్తిగా భిన్న పరిస్థితులు ఉన్నాయి. మొన్నటి వరకు తెలంగాణలో చలి తీవ్రత అధికంగా ఉంది. కానీ గత నాలుగు రోజులుగా ఈ తీవ్రత తగ్గింది.

# గ్లోబల్ సమ్మిట్‌పై సిఎం రేవంత్ సమీక్ష

హైదరాబాద్, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025పై రోజూ వరుస సమీక్షలు చేపట్టిన సీఎం రేవంత్ రెడ్డి గురువారం పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో రోజుకో అంశంపై చర్చిస్తున్నారు. తెలంగాణ రైజింగ్-2047 పాలసీ డాక్యుమెంట్‌పై ఈ భేటీలో చర్చించారు. పాలసీ డాక్యుమెంట్‌పై సీఎం రేవంత్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర అభివృద్ధిని ప్రతిబింబించేలా.. తెలంగాణ రైజింగ్-2047 పాలసీ డాక్యుమెంట్ ఉండాలని సూచించారు. 2034 నాటికి ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తెలంగాణను తీర్చిదిద్దేలా స్పష్టమైన రోడ్ మ్యాప్ పాలసీలో ఉండాలని స్పష్టం చేశారు. తెలంగాణ ఆర్థికాభివృద్ధిని మూడు రీజియన్లుగా విభజించి అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. తెలంగాణ పాలసీ, భవిష్యత్ ప్రణాళికలు వివరించేలా పాలసీ డాక్యుమెంట్ ఉండాలని అధికారులకు సూచించారు. కాగా డిసెంబర్ 8,9 తేదీల్లో ఈ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ జరగనున్న విషయం తెలిసిందే. ఈ ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానించనున్నట్లు సీఎం రేవంత్ ఇప్పటికే వెల్లడించారు. కేంద్ర మంత్రులతో పాటు సమ్మిట్‌కు ఆహ్వానించాల్సిన దేశ, విదేశాలకు చెందిన వ్యాపారవేత్తలు, ప్రముఖుల జాబితా ముందుగానే సిద్ధం చేసుకోవాలని అధికారులకు సీఎం సూచించారు.

## ఢిల్లీలో ఈగిల్ టీమ్ భారీ ఆపరేషన్

హైదరాబాద్,దేశరాజధాని ఢిల్లీ తెలంగాణ ఈగిల్ టీమ్ భారీ ఆపరేషన్ చేపట్టి డ్రగ్ కార్టెల్‌లో కీలక సభ్యులుగా ఉన్న 50 నైజీరియన్లను పట్టుకుంది. వీరంతా వీసా గడువు ముగిసినా మనదేశంలో తిష్టవేసి కుర్చున్నారు. మాదకద్రవ్యాలను అరికట్టేందుకు కృషిచేస్తున్న ఈగల్ పోలీసులు ఈ భారీ ఆపరేషన్‌ను పూర్తి చేశారు. ఢిల్లీ, గ్రేటర్ నొయిడా, గ్వాలియర్, విశాఖపట్నం కేంద్రంగా పనిచేస్తున్న డ్రగ్స్ నెట్‌వర్క్‌పై ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఢిల్లీలో అక్కడి క్రైమ్ బ్రాంచ్ సమన్వయంతో ఈగల్ ఫోర్స్ మెగా ఆపరేషన్‌ను చేపట్టింది. ఈ సంయుక్త బృందంలో ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ నుంచి వందమంది అధికారులు, ఈగల్ ఫోర్స్ నుంచి 124 మంది అధికారులు పాల్గొన్నారు. మెహ్రౌలీ, సంత్ నగర్, ప్రతాప్ ఎన్‌క్లేవ్, పుష్ప్ పార్క్, చంద్ర నగర్ తదితర 20కి పైగా ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. గడువు ముగిసిన వీసాలతో నివసిస్తున్న 50 మందికి పైగా నైజీరియన్లను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారంతా ఒక పెద్ద నైజీరియన్ డ్రగ్ కార్టెల్‌లో కీలక సభ్యులుగా ఉన్నట్లు గుర్తించారు. పలు ప్రాంతాల్లో భారీగా మాదకద్రవ్యాలు కూడా స్వాధీనం చేసుకున్నారు. గ్రేటర్ నొయిడా, గ్వాలియర్, విశాఖపట్నంలోనూ ఈగల్ ఫోర్స్ స్థానిక పోలీసుల సహకారంతో కీలక ఆపరేషన్ చేపట్టింది. ఆయా ప్రాంతాల్లో డ్రగ్ కింగ్‌పిన్‌లను, సెక్స్ వర్కర్లుగా వ్యవహరిస్తూ డ్రగ్స్ విక్రయించే మహిళలను, మ్యూల్ ఖాతాదారులను గుర్తించింది. ముందస్తు పక్కా సమాచారంతో ఈగల్ బృందం అక్కడి పోలీసుల సహకారంతో దీనిని చేపట్టింది. నైజీరియన్లను విచారిస్తే మరిన్ని వివరాలు రాబట్టవచ్చని అధికారులు భావిస్తున్నారు.

## ఎస్సీ,ఎస్టీలకు మాదిరి దివ్యాంగులకు రక్షణ

న్యూఢిల్లీ,దివ్యాంగులకు కూడా రక్షణ కవచం ఉండాలని సుప్రీంకోర్టు అభిప్రాయ పడింది. వారినికించపరిచే వారిపై చర్యలు తీసుకునేందుకు వీలుగా ఎస్సీ/ఎస్టీ చట్టం లాంటి కఠినమైన చట్టాలు అవసరమని సుప్రీం కోర్టుపేర్కొంది. ఈ దిశగా ఆలోచన చేయాలని కేంద్రానికి సూచించింది. యూట్యూబర్ రణ్‌వీర్ అలహాబాదియా, సమయ్ రైనాలకు సంబంధించి పిటిషన్ల విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. కండరాల క్షీణత సమస్యపై అవగాహన కల్పిస్తూ బాధితులతో కలిసి ఓ ప్రదర్శన నిర్వహించాలని ఈ సందర్భంగా సమయ్ రైనాకు సుప్రీం కోర్టు సూచించింది. ఓ ఆన్‌లైన్ షోలో వెన్నెముక కండరాల క్షీణతతో బాధపడుతున్న ఓ చిన్నారికి అవసరమైన ఔషధాల గురించి ప్రస్తావిస్తూ వారిని కించపరిచే విధంగా సమయ్ రైనా మాట్లాడాడు. ఈ షోలో పాల్గొన్న వారిపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ అరుదైన వ్యాధిపై పోరాడుతున్న స్వచ్ఛంద సంస్థ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దీన్ని తీవ్రంగా పరిగణించిన న్యాయస్థానం... ఆ షోలో పాల్గొన్న వారు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆదేశించింది. ఈ మేరకు సమయ్ రైనా క్షమాపణలు చెప్పాడు.రణ్‌వీర్ అలహాబాదియా, సమయ్ రైనాలకు సంబంధించిన పిటిషన్లను సుప్రీం కోర్టు నేడు విచారించింది. బాధితుల తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది అపరాజితా సింగ్.. కమెడియన్ వ్యాఖ్యలు చిన్నారులను కించపరిచేలా ఉన్నాయని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. వారు ఎంతో ప్రతిభావంతులని, ఇలాంటి వ్యాఖ్యలు క్రౌడ్ ఫండింగ్‌కు ఇబ్బందిగా మారుతాయన్నారు. వీటితో సీజేఐ జస్టిస్ సుర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఏకీభవించింది. దివ్యాంగులపై ఎవరైనా కించపరిచే వ్యాఖ్యలు చేస్తే.. ఎస్సీ/ఎస్టీ చట్టం మాదిరిగా కఠిన చట్టాన్ని తీసుకువచ్చే విషయంపై ఎందుకు ఆలోచించరని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను సుప్రీం ధర్మాసనం అడిగింది. దివ్యాంగులకు రక్షణ కల్పించేందుకు కఠిన చట్టాలు తీసుకువచ్చే విషయంపై ఆలోచించాలని సూచించింది. వారికి కావాల్సింది గౌరవ, మర్యాదలని.. వారి విజయాలను చాటిచెప్పేందుకు మీ వేదికను (ఆన్‌లైన్ షో) ఉపయోగించాలని యూట్యూబర్‌లకు సూచించింది. ఈ షోలకు దివ్యాంగులను కూడా ఆహ్వానించి, వాటితో వచ్చే నిధులను బాధితుల చికిత్సకు అందజేయాలని ఆదేశించింది.

### అబద్దాలకు అంబాసిడర్ కెటిఆర్

హైదరాబాద్,స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను 17 శాతానికి తగ్గించిందన్న బిఆర్ఎస్ నేత కేటీఆర్ వ్యాఖ్యలను మంత్రి సీతక్క తిప్పికొట్టారు. అబద్ధపు ప్రచారాలతో ప్రజలను ఏమార్చలేరని గట్టిగా జవాబు ఇచ్చారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. అబద్దాలకు అంబాసిడర్‌గా మారి కేటీఆర్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని బీసీలు విశ్వసించరని తెలిపారు. కేటీఆర్ ప్రచారం చేస్తున్నట్లుగా బీసీల రిజర్వేషన్‌లు ఎక్కడా తగ్గలేదని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు తగ్గించి గొంతు కోసిందే బీఆర్ఎస్ అని ఆరోపించారు. 2014లో జరిగిన స్థానిక ఎన్నికల్లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించిందని.. కానీ 2019 ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 22 శాతానికి తగ్గించిందని గుర్తుచేశారు. బీసీ రిజర్వేషన్లను తగ్గించి తడిబట్టతో బీసీల గొంతు కోసింది బీఆర్ఎస్ అంటూ విరుచుకుపడ్డారు. ఇప్పుడు బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదన్నారు. గత స్థానిక ఎన్నికల్లో రాష్ట్రం యూనిట్‌గా సర్పంచుల రిజర్వేషన్లు ఖరారు చేశారని.. కానీ ఆ విధానాన్ని సుప్రీంకోర్టు తప్పు పట్టిందన్నారు. సర్పంచుల రిజర్వేషన్ల ఖరారుకు రాష్ట్రం యూనిట్‌గా కాకుండా మండలాన్ని యూనిట్‌గా తీసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందని తెలిపారు. అందుకోసం ప్రత్యేకంగా డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కూడా చెప్పిందని సుప్రీం తీర్పును మంత్రి గుర్తుచేశారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేసి, దాని సిఫార్సు మేరకు మండలం యూనిట్‌గా సర్పంచుల రిజర్వేషన్ల నిర్ణయం జరిగిందన్నారు. ఆయా మండలాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీల జనాభాను బట్టి సర్పంచుల రిజర్వేషన్లు ఖరారు అయ్యాయని తెలిపారు. అందుకే కొన్ని మండలాల్లో రిజర్వేషన్లు పెరిగినట్లుగా, మరికొన్ని మండలాల్లో తగ్గినట్లుగా పైకి కనిపిస్తున్నా, స్టేట్ యూనిట్‌గా చూస్తే ఎక్కడా రిజర్వేషన్లు తగ్గలేదని వెల్లడించారు. ఏ మండలంలో కూడా రిజర్వేషన్లు 50 శాతానికి మించి ఉండరాదని సుప్రీంకోర్టు ఆదేశించిందన్నారు. రిజర్వేషన్ల ఖరారులో సుప్రీంకోర్టు తీర్పులను అమలు చేశామని వివరించారు. సుప్రీం తీర్పును అపహాస్యం చేసినట్లుగా కేటీఆర్ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కుల గణన చేపట్టి పక్కాగా రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని తెలిపారు. కుల గణనలో పాల్గొనని కేసీఆర్ కుటుంబం, బీసీ రిజర్వేషన్లపై సన్నాయి నొక్కులు నొక్కుతోందని వ్యాఖ్యలు చేశారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పిస్తామని... అందుకోసం అవసరమైన అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. అసెంబ్లీలో తీర్మానం చేశామని.. జంతర్ మంతర్‌లో స్వయంగా సీఎం నేతృత్వంలో ధర్నా చేపట్టామని మంత్రి అన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపు కేంద్ర ప్రభుత్వం చేతుల్లో ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా, కాంగ్రెస్‌ను విమర్శిస్తూ బీజేపీ బీ టీంగా బీఆర్ఎస్ వ్యవహరిస్తోందని ఆరోపించారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను

# రష్యా ఇం'ధన'మే యుద్ధానికి ఆజ్యమా?

న్యూఢిల్లీ,ప్రపంచంలో ఎన్నో పోరాటాలు జరిగాయి.. ఎన్నో చరిత్రలో చదువుకునే సాక్ష్యాలుగా ఉన్నాయి. అంతకు మించిన భారతదేశ పోరాట చరిత్రలో నవంబర్ 29 దీక్షా దివాస్ ఓ గొప్ప చారిత్రాత్మక రోజు. శాంతియుతంగా చేసిన పోరాటంలో తెలంగాణ ఉద్యమనేత కెసిఆర్ చావు చివరికి దాకా వెళ్లిన రోజు. తెలంగాణ కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి ఢిల్లీ మెడలువంచి తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను సాకారం చేయడానికి మలుపు తిరిగిన రోజు.. భవిష్యత్తు చరిత్రలో ఎప్పటికీ ఓ గొప్ప రోజుగా సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ రోజు. కెసిఆర్ ఆనాడు ఆమరణ నిరాహారదీక్షకు సిద్ధంకాకపోయి ఉంటే నేడు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాకుండా పోయేది. అంతటి కుట్రలతో తెలంగాణ వాదాన్ని బలహీనపరిచే కుట్రలను పటాపంచలు చేసి గాంధేయ మార్గంలో తెలంగాణ ఆకాంక్ష సాకారం కావడానికి మలుపు తిప్పిన రోజు. దీక్షాదివాస్ ప్రపంచ పోరాటాలైనా.. భారతదేశ పోరాటాల చరిత్రలతో సమానంగా నిలిచిన రోజు. దీక్షా దివస్ లేకుంటే నేడు తెలంగాణ రాష్ట్రం ఏర్పడడానికి మరింత జాప్యం జరిగి ఉండేది. ఆ జాప్యాన్ని గ్రహించి తాను సచ్చినా... తెలంగాణ ఆకాంక్ష సాకారం కావాలని చరిత్రను మలుపుతిప్పిన రోజు నిజంగా ఎంతో గొప్పది.తెలంగాణ రాష్ట్ర ఉద్యమమే ఓ అతి పెద్ద సవాల్.. ఏ రాజకీయ పార్టీ చేయని గొప్ప సాహసం నేటి బిఆర్ఎస్ చేసింది. ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షకోసం ఎంత మంది రాజకీయ నాయకులు వచ్చినా.. సవాళ్ల ముందు నిలబడలేకపోయారు... అలాగే సావాసమూ చేయలేకపోయారు, తెలంగాణ ఉద్యమాన్ని రగిలించి పదవులను పొందారు. రాజకీయ అధికారాన్ని అనుభవించారే తప్ప తెలంగాణ అస్తిత్వం కోసం నిలబడలేకపోయారు. దశాబ్దాల తరబడి అణువణువు తెలంగాణ ఆగం అవుతుంటే ఏ రాజకీయ నాయకుడు పట్టించుకోలేదు.. తమ భవిష్యత్తు కోసం చూసుకున్నారే తప్ప తెలంగాణ భవిష్యత్తు తరాలకోసం ఏ మాత్రమూ ఆలోచన చేయలేదు. ఫలితంగా భారతదేశ చరిత్రలోనే భిన్నమైన సంస్కృతి గల్ల తెలంగాణ.. ఏ స్వార్థం తెలియని తెలంగాణ ప్రజల బతుకులను అంధకారంలో నెట్టేసి తరతరాల సంపదను దోచుకున్నారు.. తెలంగాణ వాదం రాజకీయ నాయకులకు, రాజకీయ పార్టీలకు ఓ అధికార వాదం అయిందే తప్ప తెలంగాణ ప్రజల ఆకాంక్షకు రూపం ఇవ్వలేకపోయారు. నాటి ఉమ్మడి రాష్ట్రంలో మహామహులమని చెప్పుకొనే రాజకీయ నాయకులు సైతం తెలంగాణ యెథల గడ్డకు జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించలేకపోయారు. ఒకవేళ ప్రశ్నిస్తే తమ రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందనే భయం ఒకటైతే.. తెలంగాణ ఎదుర్కొంటున్న సవాళ్లను, సమైక్యాంధ్ర పాలకుల కుట్రలపై ఏనాడు సావాసం చేయలేకపోయారు.తెలంగాణ, కెసిఆర్ ఈ రెండు పదాలకు భిన్నమైన తేడా ఉండొచ్చు కానీ కెసిఆర్ లేకుంటే మాత్రం తెలంగాణ ఆకాంక్ష ఎప్పటికీ నెరవేరి ఉండేది కాదనడానికి అనేక సాక్ష్యాలు చరిత్రను గమనిస్తే అర్థం అవుతుంది. ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణను పరిచయం అయ్యేలా చేసింది మాత్రం కెసిఆరే. తెలంగాణ నాటి పది జిల్లాలు పడుతున్న అనేక గోసలను ఏ పత్రికలు, ఏ సమైక్య పాలకునికి కళ్లకు కన్పించలేవు. అధికారం కోసం తెలంగాణను అడుక్కునేలా చేసి.. తెలంగాణ వేరు చేస్తే కోలుకోదనేలా తెలంగాణ ప్రకృతి సంపద, భౌగోళిక వ్యవస్థను అంతా ఛిన్నాభిన్నం చేసి ఓ ఎడారిలా మార్చారు. అటువంటి తెలంగాణను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేసుకున్న తరువాత పరిపాలన అంత సులువు కాదు అనే బెరుపుతో తెలంగాణ రాజకీయ నాయకులు కూడా రాష్ట్ర ఆకాంక్ష కోసం ముందుకు అడుగువేయలేని సవాళ్లు నాటి తెలంగాణలో.. అయినా ఉద్యమ నేత కెసిఆర్ తెలంగాణ ఆకాంక్ష కోసం ఉద్యమం ప్రారంభించిన నాడు అనేక సవాళ్లు.. రాజకీయ ఒత్తిడిలు, కుట్రలు.. అయినా అవేవి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ఆపలేకపోయాయి.ఎన్ని సవాళ్లు ఎదురైనా కెసిఆర్ అనే మహాశక్తి తెలంగాణ ఉద్యమాన్ని ఉధృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఓ వైపు రాజకీయ కుట్రలు అయితే, మరో వైపు విషపు రాతలతో తెలంగాణ ఉద్యమాన్ని ఆగం చేసే చర్యల వంటి ఎన్ని సవాళ్లు ఎదురైనా గులాబీ దళపతి వ్యూహాల ముందు అవేమీ పనిచేయలేకపోయాయి. తెలంగాణ అరవై ఏళ్ల గోసకు 14 ఏళ్ల మడమ తిప్పని పోరాటంతో ఓ పరిష్కారం లభించి రాష్ట్ర ఆకాంక్ష ఏర్పాటు అయింది. కెసిఆర్ ఓ పెద్ద రాజకీయ చాణక్యుడు, రాదనుకొని తెలంగాణ వాదాన్ని ఎందరో విడిచిపెట్టారు.. వాస్తవానికి తెలంగాణ రాష్ట్రం ఎప్పటికీ అసాధ్యం అని ఉన్న తెలంగాణ సమాజానికి కెసిఆర్ తోనే రాష్ట్ర కల సాధ్యం అనే స్థాయిలో ఆయన పోరాటం నిలిచింది. అంతటి పటిమ, వ్యూహాలు కలిగిన నాయకుడు కెసిఆర్. తెలంగాణ రాష్ట్రం సాధించడమే మా అంతిమ లక్ష్యమని, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడానికి ఎంతటి త్యాగానికైనా వెనుకాడను అని మొండి పట్టుదలతో రాష్ట్రాన్ని సాధించారు కెసిఆర్. కెసిఆర్ తెలంగాణ నినాదాన్ని బలంగా మోయకుంటే రాష్ట్రం వచ్చి ఉండేది కాదు.తెలంగాణ ఆకాంక్ష తెలంగాణ కోసం కెసిఆర్ చేసిన త్యాగం చరిత్రలో ఎప్పటికీ సువర్ణ అధ్యాయం. తెలంగాణ సాధించడం కోసమే రాజకీయ పార్టీని స్థాపించిన కెసిఆర్ అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని, సమైక్యపాలకుల కృత్రిమ కుట్రలను ఎదుర్కొని ఉక్కు మనిషిగా నిలబడ్డారు. దశాబ్దన్నర కాలం అలసిపోకుండా నడిపిన ఉద్యమం వల్ల రాష్ట్ర ఆకాంక్ష కల సాకారమైంది.



తెలంగాణ రాష్ట్రం కోసం జరుగుతున్న రాజకీయ ఉద్యమంలో కెసిఆర్‌ను దెబ్బ కొట్టడానికి ఆనాడు చేసిన కుట్రలు అన్నీఇన్నీ కావు. గులాబీ జెండాను లేకుండా చేయాలని చేసిన ప్రతీ కుట్రను ఛేదించి రాష్ట్రం సాధించడంలో కెసిఆర్ త్యాగం భవిష్యత్తులో ఎప్పటికీ చరిత్రే. తెలంగాణ వచ్చే వరకూ రాజీనామాలు చేస్తూ ప్రజల్లో ఉద్యమ ఆకాంక్షను బలంగా తీసుకెళ్లిన పార్టీ నేటి బిఆర్ఎస్. తెలంగాణ కోసమే పుట్టి.. తెలంగాణ సాధించి ఆత్మగౌరవాన్ని పెంచింది. తెలంగాణలోని ప్రజల ఆవేదనలకు రూపమై కొట్లాడింది. అడుగడుగునా తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను ఎండగట్టి సమైక్య పాలకుల కుట్రలను ప్రజలముందు ఉంచింది. తెలంగాణ పడుతున్న గోసను చట్టసభల ద్వారా ఈ భారతదేశానికి గొంతెత్తి విన్పించింది కెసిఆర్ నాయకత్వమే. కెసిఆర్ అనే మూడు అక్షరాల శక్తి తెలంగాణలోని అణువణువుపై అవగాహన పెంచుకొని తెలంగాణ యెథలను ఈ ప్రపంచానికి చాటారు.అప్పటి వరకూ తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ఏ రాజకీయ నాయకుడు, ఏ రాజకీయ పార్టీ ప్రశ్నించలేకపోయింది. ఫలితంగా తెలంగాణ గడ్డ చంటి బిడ్డలను అమ్ముకునే దుస్థితి ఒకవైపు అయితే.. వరకట్న చావులు, గల్ఫ్ వలసలు, ఒకటి రెండు కాదు పుట్టెడు శోకంతో తెలంగాణలోని ప్రతీ పల్లె గొల్లుమని ఏడ్చేది. ఏ మనిషిని కదిలించినా పచ్చికుండ లాంటి దుఃఖం గుండెల్లో దాచుకొని బతికిన దుర్భర పరిస్థితులను చూసింది తెలంగాణ. సంవత్సరాల తరబడి ఈ దేశాన్ని, రాష్ట్రాన్ని పరిపాలించిన కాంగ్రెస్, బిజెపిలు తెలంగాణ దుఃఖాన్ని దూరం చేయలేకపోయాయి.ఇక సంక్షేమం అనేది తెలంగాణ ప్రజలకు దొరకని పరిస్థితి. అంతటి ఘోరమైన ఆవేదనలను కెసిఆర్ వచ్చే వరకూ ఎవరూ దూరం చేయలేకపోయారు. వాస్తవానికి తెలంగాణ ఎదుర్కొంటున్న ఇబ్బందులపై కనీస అవగాహన లేకపోవడం వల్ల తెలంగాణ ప్రజల యెథలను ఏ ప్రభుత్వం దూరం చేయలేకపోయింది. కెసిఆర్ ఉద్యమ జెండా పట్టుకొని తిరిగి చూసిన తెలంగాణ యెథలపై అవగాహన పెంచుకొని పదేళ్ల కెసిఆర్ పాలనలో పరిష్కారం చూపగలిగారు.తెలంగాణ పడుతున్న గోసలు తీర్చే మానవీయ పథకాలతో పదేళ్లు కెసిఆర్ తెలంగాణ రాష్ట్రానికి అండగా నిలిచారు. పుట్టిన చంటి బిడ్డ నుంచి పండు ముసలవ్వ దాకా వారి బాగోగులు చూసే సంక్షేమ పథకాలతో యెథలను దూరం చేశారు. విస్తారమైన బంగారం పండే భూములు ఉన్నా.. చుక్కనీరు రాక ఎండి నెర్రలు బారిన భూముల గొంతు తడిపేందుకు 70 వేల చెరువుల పునరుద్ధరణ చేసి భూగర్భ జలాలు పెరిగేలా చేసి తెలంగాణకు తాగు, సాగునీటి కష్టాలు తీర్చారు. తెలంగాణ లో డిగ్రీ విద్యకు కళాశాలలు లేని దుస్థితి నుంచి నేడు జిల్లాకో మెడికల్ కళాశాల ఏర్పాటు చేసి ప్రపంచ దేశాలతో తెలంగాణ బిడ్డలు పోటీ పడేలా గుణాత్మక మార్పు తీసుకువచ్చారు. ప్రపంచ దిగ్గజ కంపెనీలు హైదరాబాద్‌కు వచ్చేలా పరిశ్రమలకు కేంద్రంగా తెలంగాణ మారింది. పదేళ్ల కెసిఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రపంచంలో అత్యుత్తమమైన అవార్డులను, ప్రశంసలను అందుకుంది. భారతదేశంలోని అనేక రాష్ట్రాలు కెసిఆర్ ప్రవేశపెట్టిన పథకాలను అనుసరించాయంటే కెసిఆర్ ప్రజాసంక్షేమ ఆలోచన ఎంత శక్తివంతమైనదో అర్థం చేసుకోవచ్చు.ప్రాంతీయ పార్టీల్లో బలమైన శక్తిగా ఉన్న బిఆర్ఎస్‌ను ఎదగనీయకుండా రెండు జాతీయ పార్టీలు తెలంగాణలో కుట్ర పన్నాయనడంలో సందేహం లేదు. ఓ ఇంటికి తండ్రి దూరమైతే ఇల్లు దివాలా తీసినట్లు ఇప్పుడు తెలంగాణ పరిస్థితి అలా తయారైంది. అణువణువు తెలంగాణ కోసం తెలిసిన కెసిఆర్ పాలనలోనే బాగుండేదని అటు మాట్లాడుతున్నారు. తెలంగాణ అస్తిత్వ ప్రతీకలు అయిన బతుకమ్మను, తల్లి తెలంగాణ విగ్రహం నుంచి తొలగించడం, తదితర చిహ్నాలను మార్పుచేసి తెలంగాణలో పాశ్చాత్య సంస్కృతికి దారులు వేశారు. ఇటువంటి అనేకమైన ప్రజా అవసరాలకు ఉపయోగపడని నిర్ణయాలతో తెలంగాణ మరింత అప్రతిష్ట పాలుకు కారణం అవుతుంది. వీర చరిత్ర, త్యాగాల చరిత్ర ఉన్న తెలంగాణలో పాశ్చాత్య సంస్కృతికి తెరలేపారు. కెసిఆర్‌ను పదేపదే ద్వేషిస్తూ ఆయన త్యాగాన్ని చరిత్ర నుంచి కనుమరుగు చేయాలని కాంగ్రెస్ చూస్తున్నది.. కానీ కెసిఆర్ అనే మూడు అక్షరాల పేరు... ఈ భూమి ఉన్నంత వరకూ ప్రపంచ పోరాటాల చరిత్రలో ఆయన ఎప్పటికీ ఓ గొప్ప చరిత్రనే.. కెసిఆర్ తెలంగాణ తల్లి విముక్తి కోసం కన్న బిడ్డ.. ఆయనను ఈ పోరాటాల గడ్డ ఎప్పటికీ మరవదు. భవిష్యత్తులో కెసిఆర్ పాలనను తెచ్చుకోవడానికి ప్రజలు ఇప్పటినుంచే సిద్ధమవుతున్నారు.

# రైతులపై మొసలి కన్నీరు ఆపండి



విజయవాడ, ఐదేళ్ల పాటు రైతులను కనీసంగా కూడా పట్టించుకోని వైకాపా ఇప్పుడు రైతుల గురించి మొసలి కన్నీరు కార్చడం వింతగా ఉందని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ విమర్శించారు. ధాన్యం సేకరణ మొదలు, వారికి వివిధ రకాల సాయం అందించడంలో గత ఐదేళ్లలో ఎలా ఉండేదో రైతులే చెబుతారని అన్నారు. రైతులకు రూపాయి నష్టం లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ మంత్రి అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. 24 గంటల్లో వారి ఖాతాల్లో డబ్బులు వేస్తున్నామని.. అయినా వైసీపీ నేతలు అన్యాయంగా అబద్దాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రూ.1674 కోట్లు బకాయిలు పెట్టి పారిపోయిన వైసీపీ నేతలా రైతుల పక్షాన మాట్లాడేది అంట్కూ ÷ర్ అయ్యారు. ఇప్పటి వరకు 8 లక్షల 22 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని వెల్లడించారు. కృష్ణా జిల్లాలో లక్షా 7 వేల టన్నుల ధాన్యం సేకరించడం రికార్డ్ అని తెలిపారు. గోదావరి జిల్లాల నుంచి లక్ష టన్నుల పైనే ధాన్యం సేకరించామని చెప్పారు. అధికారులు రేయింబవళ్లు కష్టపడి పని చేస్తున్నారని.. వారి మనోధైర్యం దెబ్బ తీసేలా వైసీపీ నేతలు నోటికొచ్చినట్లు విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో కృష్ణా జిల్లాలో 2022-23 ఖరీఫ్‌లో కేవలం 13వేల 560 మెట్రిక్ టన్నులు ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారని.. 2023-24లో 16 వేల 978 మెట్రిక్ టన్నులు మాత్రమే కొన్నారని తెలిపారు. తాము మాత్రం లక్షా 7 వేల 960 మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నామని చెప్పుకొచ్చారు. ఖరీఫ్, రబీలో కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు జిల్లాల్లో ట్రాన్స్ పోర్టు వాహనాల బకాయిలు నేడు రూ.9 కోట్లు చెల్లించామని మంత్రి చెప్పారు. 7 కోట్ల 53 లక్షల గోనె సంచులను ఏర్పాటు చేశామన్నారు. సీఎం సూచనలతో లక్ష సంచులు అదనంగా సిద్ధంగా ఉంచామని తెలిపారు.మూడు నెలల్లో జరగాల్సిన ప్రక్రియ.. వాతవరణంలో వచ్చిన మార్పులతో ముందే ధాన్యం సేకరించామని చెప్పుకొచ్చారు. రైతుల ఆందోళనను గుర్తించి.. ప్రభుత్వం చాలా వేగంగా స్పందించిందన్నారు. రైతులు కూడా అర్థం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం నుంచి ఇంత పెద్ద కార్యక్రమం చేస్తున్నామంటే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇచ్చే సూచనలు, ప్రోత్సాహం వల్లే అని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిబంధనల మేరకు 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కొంతమంది మాఫియాగా ఏర్పడి రైతులను ఇబ్బందులు పెట్టడానికి వారి స్వలాభం కోసం డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. తాము పూర్తి పారదర్శకత కోసం వాహనాలకు జీపీయస్ ఏర్పాటు చేస్తే.. దళారులు రైతులను మాయ మాటలతో మోసం చేస్తున్నారన్నారు.

## కవితను ఎందుకు పంపించారో చెప్పండి

జనగామ,కేటీఆర్ వ్యవహార శైలి నచ్చకపోవడంతోనే సొంత చెల్లెలు కవిత పార్టీ నుంచి బయటకు వెళ్లిపోయిందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి విమర్శించారు. పార్టీలో అంతర్గత కలహాలతోనే ఆమెను కావాలనే బయటకు పంపారని అన్నారు. ఇంతకన్నా దారుణం మరోటి ఉండదన్నారు. నీతులు వల్లించే నేతలు ఈ విషయంలో సమాధానం చెప్పాలన్నారు. కేసీఆర్ తర్వాత భారత రాష్ట్ర సమితి పార్టీ ముక్కలు చెక్కలవుతుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి వ్యాఖ్యానించారు. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో మీడియాతో కడియం మాట్లాడారు. హరీశ్‌రావు సైతం పార్టీ నుంచి బయటకు వెళ్లే సమయం కోసం ఎదురుచూస్తున్నట్లు వివరించారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో కేంద్రంపై ఒత్తిడి తేకుండా.. కేసులకు కేటీఆర్ భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. గతంలో ఉన్న మేరకు ప్రభుత్వం రిజర్వేషన్లు అమలు చేస్తుంటే కెటిఆర్ తదితరులు కావాలనే యాగీ చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

## మావి పండగ చీరలు... రేవంత్ వన్నీ ఓట్ల చీరలు

సిద్దిపేట, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల పేరుతో బీసీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మోసం చేశారని మాజీమంత్రి హరీశ్‌రావు మరోమారు విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి.. కేవలం 17 శాతమే ఇచ్చారన్నారు. కేసీఆర్.. పండుగ కోసం చీరలిస్తే రేవంత్‌రెడ్డి మాత్రం ఓట్ల కోసమే చీరలు పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రికి ఎంతసేపూ ఓట్ల రాజకీయమే తప్ప.. రాష్ట్ర ప్రయోజనాల మీద శ్రద్ధ లేదన్నారు. సిద్దిపేటలోని భారత రాష్ట్ర సమితి జిల్లా కార్యాలయంలో గురువారం దీక్షా దివస్ సన్నాహక సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. నవంబరు 29.. చరిత్రను మలుపుతిప్పిన రోజన్నారు. కేసీఆర్ దీక్ష, అమరుల త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం సాకారమైందన్నారు. రాష్ట్ర సాధనకు ఉద్యమగడ్డ అయిన సిద్దిపేటలో 1,531 రోజుల పాటు దీక్షలు కొనసాగటం చరిత్ర అన్నారు. నవంబరు 29 నుంచి డిసెంబరు 9 వరకు నిర్వహించనున్న కార్యక్రమాలపై చర్చించారు.

## బిఆర్ఎస్,బిజెపిలు బిసి ద్రోహులు

హైదరాబాద్, బీసీ రిజర్వేషన్ అంశంపై ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బీసీల కోసం పోరాడేది తాము మాత్రమేనని, ఇతర పార్టీలు మాత్రం రాజకీయ ప్రయోజనాల కోసం మొసలి కన్నీళ్లు కారుస్తున్నాయని తీవ్ర విమర్శలు చేశారు.. బీఆర్ఎస్, బీజేపీ. బలహీనవర్గాల ద్రోహులు అని మండిపడ్డారు.. గతంలో ఇతర రాష్ట్రాల్లోన్రూ రిజర్వేషన్లు 50 శాతం మించకూడదన్న కోర్టు తీర్పులు ఉన్నప్పటికీ, ఈ పరిమితిని అధిగమించేందుకు ప్రభుత్వం సేకరించిన డాటా, నివేదికలు ఆధారంగా కోర్టులో సమర్థవంతంగా వాదనలు వినిపిస్తున్నామని తెలిపారు.అసలు బిసి కోటాపై కోర్టులో ఇంప్లీడ్ ఎందుకు కాలేదు? అని పొన్నం ప్రశ్నించారు.. సిగ్గులేకుండా బయట విమర్శలు చేసే బీఆర్ఎస్ నాయకులు కోర్టులో మాత్రం లేరు అని మంత్రి ఆరోపించారు. కోర్టులో రిజర్వేషన్ నిలిపేస్తే బీఆర్ఎస్ నేతలు నవ్వుకుంటున్నారని విమర్శించారు. అటు.. బీసీ రిజర్వేషన్ల అమలులో అడ్డంకులు తొలగించేందుకు కేంద్రం సహకరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం దగ్గర పెండింగ్‌లో ఉన్న నిధులు ఇప్పించేందుకు బీజేపీ నేతలు ప్రయత్నం చేయడం లేదా? అని ప్రశ్నించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు 42? రిజర్వేషన్లతోనే జరపాలన్న ఆలోచన ఉందని తెలిపారు పొన్నం.. ఇక బీసీ సర్వేలో పాల్గొనని పార్టీలకు మాట్లాడే నైతిక హక్కు లేదని పొన్నం తీవ్రంగా హెచ్చరించారు. కేంద్రంలో మా ప్రభుత్వం ఉంటే గంటల్లో బీసీ రిజర్వేషన్ అమలు అయ్యేదన్న ఆయన.. మేము కోర్టులో చేస్తున్న పని మీకూ తెలుసు. తెలిసీ మాపై ఆరోపణలు చేయొద్దు. సలహాలు ఇవ్వండి.. తీసుకుంటాం.. కానీ, రాజకీయ పార్టీల ఒత్తిడికి లోనవ్వొద్దు అని సచించారు.. బీజేపీ?బీఆర్ఎస్ బీసీ ద్రోహులు అని మండిపడ్డారు పొన్నం.. బలహీన వర్గాల పట్ల బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అన్యాయం చేశాయని తీవ్రంగా మండిపడ్డారు. రాజ్యాంగం ఏం చెబుతుందో తెలియకపోతే తెలుసుకోవాలి. గిరిజన ప్రాంతాల్లో వారికి హక్కుగా రిజర్వేషన్ ఇవ్వాలి.. బీసీ సర్వేలో పాల్గొనని వారు ఇప్పుడు మాట్లాడటం హాస్యాస్పదం అని వ్యాఖ్యానించారు.

## మూడు కొత్త జిల్లాలు..ఐదు రెవెన్యూ డివిజన్లు

అమరావతి, రాష్ట్రంలో కొత్తగా మూడు జిల్లాలతోపాటు ఐదు రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేయాలని చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో అందుకు సంబంధించిన నోటిఫికేషన్లను ప్రభుత్వం గురువారం జారీ చేసింది. రాష్ట్రంలో కొత్తగా మూడు జిల్లాల ఏర్పాటుకు సీఎం చంద్రబాబు మంగళవారం ఆమోదం తెలిపారు. మార్కాపురం, మదనపల్లె, రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీంతో రాష్ట్రంలో జిల్లాల సంఖ్య 26 నుంచి 29కి పెరిగింది. కొత్తగా 5 రెవెన్యూ డివిజన్లు, ఒక మండలం ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. జిల్లాల పునర్విభజనపై మంత్రుల కమిటీ ఇచ్చిన నివేదికపై చర్చించిన అనంతరం సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారు. అనకాపల్లి జిల్లాలో నక్కపల్లి, ప్రకాశం జిల్లాలో అద్దంకి, కొత్తగా ఏర్పాటయ్యే మదనపల్లి జిల్లాలో పీలేరు, నంద్యాల జిల్లాలో బనగానపల్లె, శ్రీసత్యసాయి జిల్లాలో మడకశిర రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. కర్నూలు జిల్లా ఆదోని మండలాన్ని విభజించి కొత్తగా పెద్దహరివనం మండలాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇక రాష్ట్రంలో ఏర్పాటు కానున్న మూడు జిల్లాలను పరిశీలిస్తే.. రంపచోడవరం నియోజకవర్గంలోని రంపచోడవరం, చింతూరు రెవెన్యూ డివిజన్లతో కొత్తగా పోలవరం జిల్లా ఏర్పాటు కానుంది. రంపచోడవరం రెవెన్యూ డివిజన్‌లో రంపచోడవరం, దేవీపట్నం, వై రామవరం, గుర్తేడు, అడ్డతీగల, గంగవరం, మారేడుమిల్లి, రాజవొమ్మంగి మండలాలు ఉండనున్నాయి. ఇక చింతూరు డివిజన్‌లో యెటపాక, చింతూరు, కూనవరం, వరరామచంద్రాపురం మండలాలను చేర్చారు. ఎర్రగొండుపాలెం, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు నియోజకవర్గాల్లోని మార్కాపురం, కనిగిరి రెవెన్యూ డివిజన్లతో కొత్త జిల్లాగా మార్కాపురం ఏర్పాటు కానుంది. ఈ రెవెన్యూ డివిజన్‌లోని యర్రగొండుపాలెం, పుల్లల చెరువు, త్రిపురాంతకం, దోర్నాల, పెద్దారవీడు తుర్లుపాడు, మార్కాపురం, పొదిలి, కొనకనమిట్ల మండలాలు, అలాగే కనిగిరి డివిజన్‌లోని హనుమంతునిపాడు, వెలిగండ్ల, కనిగిరి, పెదచెర్లోపల్లి, చంద్రశేఖరపురం, పామూరు, గిద్దలూరు, బేస్తవారిపేట, రాచర్ల, కొమరోలు, కంభం, అర్ధవీడు మండలాలు కొత్తజిల్లాలో ఉండనున్నాయి.

# రాష్ట్రంలో రాజకీయ పండుగ.. పల్లెల్లో నెల రోజులపాటు సందడి!




హైదరాబాద్,తెలంగాణలో పంచాయతీ ఎన్నికల నిర్వహణ తేదీలు ప్రకటించడంతో రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ పండుగ వాతావరణం నెలకొంది. రాష్ట్రమంతా దాదాపు నెల రోజుల పాటు సందడి నెలకొననున్నది. ముఖ్యంగా పల్లెలు రాజకీయంగా వేడెక్కనున్నాయి. ఇప్పటికే ఒకసారి ప్రకటించిన ఎన్నికలు అర్ధంతరంగా రద్దయిన విషయం తెలిసిందే. గత వారం రోజులుగా రాజకీయ నాయకుల ప్రకటనలు, వరుస పరిణామాల నేపథ్యంలో నేడో రేపో ఎన్నికల షెడ్యూల్ విడుదలవుతోందనే ముందస్తు సమాచారం మేరకు గ్రామాల్లో రాజకీయ నాయకులు మానసికంగా ఎన్నికలకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం పంచాయతీ ఎన్నికల నిర్వహణకు మాత్రమే ఎన్నికల కమిషన్ సిద్ధమైనప్పటికీ అధికారిక కార్యక్రమాలు, రాజకీయ పార్టీల హడావుడి, నేతలంతా పట్నాల్లో మకాం వేసి ఉన్నందున, జిల్లా కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాలు పట్టణ ప్రాంతాలైనప్పటికీ అన్నింటికి కేంద్రంగా ఈ పట్టణ ప్రాంతాలే ఉన్నందున పరోక్షంగా అక్కడ కూడా రాజకీయ సందడి ప్రారంభం కానున్నది. మూడు దశల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నప్పటికీ 31 జిల్లాలను మూడు దశలుగా విభజించినందున ప్రతీ దశ రాజకీయ వాతావరణం జిల్లా అంతటా అంటే రాష్ట్ర వ్యాప్తంగా ప్రభావం కనబరుస్తోంది. ఎన్నికల తేదీలు ప్రకటించిన నవంబర్ 25 నుంచి ఎన్నికలు ముగిసే డిసెంబర్ 17 వరకు ఎక్కడ చూసినా ఎన్నికల అంశాలకే ప్రాధాన్యత చేకూరుతోంది. ఎన్నికలు ముగిసినప్పటికీ గెలుపోటములు, విజయోత్సవాలు, ప్రమాణస్వీకారాలు, బాధ్యతల స్వీకరణ, గెలిచిన వారి ఆనందం, ఓడిన వారి విచారంతో అటూ ఇటూ నెలంతా ఎన్నికల సందడికే ప్రాధాన్యత చేకూరనుంది.

గెలుపు గుర్రాల ఎంపిక పై శ్రద్ధ

తాజాగా వార్డులు, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ కు సంబంధించిన రిజర్వేషన్లు ఖరారు కావడంతో అభ్యర్థుల ఎంపిక దిశగా పార్టీ నాయకులు ముఖ్యంగా నియోజకవర్గ ఇంచార్జ్ లు, ఎమ్మెల్యేలు పావులు కదుపుతున్నారు. గెలుపు గుర్రాల పై కేంద్రీకరిస్తున్నారు. ఆర్థిక, సామాజిక అండ, పార్టీలో, కేడర్ లో పట్టుతో పాటు నియోజకవర్గ ఇంచార్జ్ లేదా ఎమ్మెల్యేలకు నమ్మిన బంటు అయితే పెద్దపీట వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. అభ్యర్థి లెక్కల్లో తారుమారైతే మరో వైపు జంప్ చేసేందుకు సైతం రంగం సిద్ధం చేసుకునేవారున్నారు. నిన్నటి వరకు సర్పంచ్ పదవి పై కన్నేసిన నాయకులు రిజర్వేషన్లు తమకు అనుకూలంగా రాకపోవడంతో కొందరు నిరాశకు లోనుకాగా, మరి కొందరికి కొత్తగా అవకాశం దక్కనుండడంలో ఆనందంలో ఉన్నారు.

నెల రోజులు పల్లెల్లో పండుగ

నియమాలు, నిబంధనలు,కోడ్ తదితర అనేక అంశాలు చెబుతున్నప్పటికీ దాదాపు నెలరోజుల పాటు పల్లెల్లో రాజకీయ పండుగ వచ్చినట్లే. పల్లె ఎన్నికలైనా పోటీ తీవ్రంగా ఉన్నందున ప్రతిష్టకు పోయి ఎంతకైనా సిద్ధమయ్యేవారు ఎక్కువ ఈ నేపథ్యంలో పోటీచేసేందుకు సిద్ధమవుతున్న వారు చేతి చమురు వదిలించుకోవడం ఖాయం. ఎమ్మెల్యేలు, ఇంచార్జ్ లు కూడా తమ పట్టు నిలుపుకునేందుకు వెనుకా, ముందు అన్ని రకాల అండగా నిలిచేందుకు ఇప్పటి నుంచే పావులు కదుపుతున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో మూడు ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ రాష్ట్రస్థాయిలో తమ తమ సన్నాహాలు చేసుకుంటున్నాయి. కొన్ని పక్షాలు నియోజకవర్గ స్థాయి సమావేశాలు, ఉమ్మడి జిల్లా స్థాయి ముఖ్యుల సమావేశాలు నిర్వహించి ఎన్నికల గీతోపదేశం చేసేందుకు సైతం ప్రణాళికలు రూపొందించుకున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కూడా తమదైన పద్ధతిలో పల్లెల పై పట్టు సాధించేందుకు సర్వసన్నద్ధమవుతుండగా, అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయి, పార్లమెంటు ఎన్నికల్లో సున్నా చిక్కి, మొన్నటి మొన్న జూబ్లీ ఫలితం ఊరించి ఉసూరునిపించడంతో స్థానిక ఎన్నికల్లో విజయం సాధించి పోయిన పరువును నిలబెట్టుకోవాలని, కాంగ్రెస్ పై కసి తీర్చుకోవాలని పట్టుదలతో బీఆర్ఎస్ సిద్ధమవుతోంది. అన్ని రకాల హంగులు, అండ ఉన్నప్పటికీ బీజేపీ మాత్రం ఈ ఎన్నికలను వినియోగించుకుని రాష్ట్రవ్యాప్తంగా కాషాయ పాదులు వేస్తే వచ్చే ఎన్నికల నాటికైనా చిగురిస్తాయనే ఆశతో సిద్ధమవుతోంది.

# కుంభకోణానికి ఆస్కారమే లేదు

హైదరాబాద్,ఇండస్ట్రియల్ పాలసీ పై కొంతమంది అసత్య ప్రచారం చేస్తున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భాగ్యనగరాన్ని పొల్యూషన్ ఫ్రీగా చేయడమే తమ ప్రభుత్వ పాలసీ లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఈ పాలసీలో కుంభకోణానికి ఆస్కారమే లేదని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం తెచ్చింది పారదర్శకమైన పాలసీ అని చెప్పుకొచ్చారు. గురువారం గాంధీభవన్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు . బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు తాము తెచ్చిన ఇండస్ట్రియల్ పాలసీ అర్థం కాలేదని తెలిపారు. ప్రతిపక్షాల నేతలు కావాలనే తమ ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని ధ్వజమెత్తారు. హైదరాబాద్ నగరాన్ని కాలుష్య రహితంగా మార్చేందుకు ఇండస్ట్రీలను ఓఆర్ఆర్ బయటకు పంపాలనే డిమాండ్ ఉందని గుర్తుచేశారు. ఈ పాలసీ తమ ప్రభుత్వం కొత్తగా తెచ్చినది కాదని వివరించారు. కేసీఆర్ ప్రభుత్వంలో కూడా ఈ పాలసీపై చర్చ జరిగిందని గుర్తుచేశారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చేది లేదని... పాలసీ మార్చేది లేదని చెప్పుకొచ్చారు. ఇండస్ట్రియల్ పాలసీ రూపకల్పనలో తాను భాగమై ఉన్నానని వివరించారు. కొత్త ఇండస్ట్రియల్ పాలసీతో తెలంగాణ రాష్ట్రానికి అదనపు ఆదాయం వస్తుందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసినా ప్రతిపక్షాల నేతలకు వ్యతిరేకించాలనే ఉద్దేశ్యం తప్పా ఏం లేదని విమర్శించారు. అయితే, నల్గొండ డీసీసీ నియామకంపై స్పందించడానికి నిరాకరించారు. పార్టీ ఇంటర్నల్



విషయాలను బయట మాట్లాడనని తెలిపారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. తమ ప్రభుత్వంలో విద్యుత్ శాఖలో ఎలాంటి కుంభకోణం జరగలేదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో భద్రాద్రి కొత్తగూడెం పవర్ ప్రాజెక్టు పెద్ద కుంభకోణం జరిగిందని ఆరోపించారు. గత ప్రభుత్వం ఇండియా బుల్ అనే కంపెనీ దగ్గర ఉపయోగంలో లేని ఎక్విప్‌మెంట్ ఎందుకు కొన్నదని ప్రశ్నించారు. భద్రాద్రి ప్రాజెక్టులో అవుట్ డేటెడ్ టెక్నాలజీ వాడాల్సిన అవసరం ఏముంది..? అని నిలదీశారు. భద్రాద్రి ప్రాజెక్టు అనవసరంగా తెలంగాణ ప్రజలపై రుద్దిన ప్రాజెక్టు అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శలు చేశారు.

# అమరావతిని అద్భుత రాజధానిగా నిర్మాణం



అమరావతి,దేవతల రాజధాని అమరావతి అయితే... ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మనం నిర్మించుకుంటున్న రాజధాని అంతలా ఉంటుందని అన్నారు. అన్ని అడ్డంకులు అధిగమించి ముందుకు సాగుతున్నామని అన్నారు. రాజధానిలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ విస్తరణకు సీఎం చంద్రబాబు గురువారం భూమి పూజ చేశారు. అనంతరం ఓం నమో వేంకటేశాయ అంటూ సీఎం చంద్రబాబు ఉపన్యాసాన్ని ప్రారంభించారు. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి ఈ యుగంలో ఏపీలో అవతరించారన్నారు. 2019లో ఆలయాన్ని నిర్మించాలని సంకల్పం చేశామని గుర్తుచేశారు. ఈ ప్రాంతానికి పేరు పెట్టినప్పుడే వేంకటేశ్వర స్వామి తన ద్వారా సంకల్పించారని తెలిపారు. ఇక్కడి రైతాంగం 29 వేల మంది 33,000 ఎకరాల భూమిని స్వచ్ఛందం గా ఇచ్చారని.. వారిని అభినందిస్తూ ధన్యవాదాలు తెలియజేశారు. వారికి ఆ సంకల్పాన్ని వేంకటేశ్వర స్వామి కల్పించారన్నారు. కృష్ణానది తీరాన పవిత్రమైన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం నిర్మితమైందని తెలిపారు. 1983లో తిరుమలలో అన్నదానాన్ని ఎన్టీఆర్ ప్రారంభిస్తే.. 2003లో ప్రాణదానం కార్యక్రమాన్ని స్విమ్స్‌లో ప్రారంభించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. 'మా ఇంటి దైవం వేంకటేశ్వర స్వామి... మా ఇంటి నుంచి చూస్తే ఆయన నామాలు కనిపిస్తాయి' అని చెప్పుకొచ్చారు. ఎప్పుడూ కూడా వేంకటేశ్వర స్వామికి అప్రతిష్ట పాలు తెచ్చే పనిని చెయ్యనని.... ఎవరినీ చేయనివ్వనని స్పష్టం చేశారు. వేంకటేశ్వర స్వామి వద్దకు ఎప్పుడు వెళ్ళినా క్యూ లైన్‌లోనే వెళతానని తెలిపారు. ముఖ్యమంత్రిగా కాదు... భక్తుడిగా వెళతానని సీఎం అన్నారు. కొందరు తప్పులు చేస్తారని.. తప్పు చేసిన వారికి ఇంకో జన్మలో శిక్ష ఉంటుందను కుంటారని.. అయితే తప్పు చేస్తే మాత్రం వేంకటేశ్వర స్వామి ఈ జన్మలోనే శిక్షిస్తారన్నారు. గడచిన ప్రభుత్వం విధ్వంసం తప్ప మంచి చేసిన పరిస్థితులు లేవని విమర్శించారు. ఐదేళ్లు ఇక్కడ రైతులకు నరకాన్ని చూపించారన్నారు. వేంకటేశ్వర స్వామిని రైతులు నమ్ముకున్నారని.. న్యాయస్థానం నుంచి దేవస్థానం వరకు పాదయాత్ర చేసిన ఈ ప్రాంత రైతులను అభినందిస్తున్నట్లు తెలిపారు. ఈ దేవాలయాన్ని రూ.260 కోట్లతో పూర్తి చేస్తామన్నారు. తిరుపతి ప్రాంగణం తరహాలోనే ఇక్కడ గుడిని నిర్మిస్తామని.. రెండున్నర సంవత్సరాల్లో పూర్తి చేస్తామని ప్రకటించారు. దేవాలయాల నిర్మాణానికి దాతలు కూడా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యం, ఆనందం, సంపద ప్రతి ఒక్కరికి అందించాలని వేంకటేశ్వర స్వామి ప్రార్థిస్తున్నానని అన్నారు. దేవతల రాజధాని అమరావతి నమూనాగా ఈ అమరావతి ఉండాలని వేంకటేశ్వర స్వామిని కోరుతున్నట్లు తెలిపారు. రెండు దశల్లో రూ.260 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులు జరుగనున్నాయి. ఆలయ ప్రాకారం, మహా రాజగోపురం, మండపాలు, ఆంజనేయస్వామి ఆలయాల నిర్మాణం జరుగనుంది. మాడ వీధులు, అన్నదాన కాంప్లెక్స్ తదితర నిర్మాణాలకు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా శంకుస్థాపన జరిగింది. మొదటి దశలో రూ.140 కోట్లు వ్యయంతో వివిధ పనులు నిర్వహించనున్నారు. రూ.92 కోట్లతో ఆలయం చుట్టూ మహాప్రాకారం నిర్మాణం జరుగనుంది. ఏడంతస్తుల మహా రాజగోపురం, ఆర్జిత సేవా మండపం, అద్దాల మండపం, వాహన మండపం, రథ మండపం, ఆంజనేయ స్వామి ఆలయం, పుష్కరిణి, కట్ స్టోన్ ఫ్లోరింగ్‌ల నిర్మించనుండగా.. వీటి నిర్మాణాలకు రూ.48 కోట్లు ఖర్చు చేయనున్నారు. శంకుస్థాపన కార్యక్రమంలో దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మంత్రి నారాయణ, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, పలువురు ఎమ్మెల్యేలు, టీటీడీ బోర్డు మెంబర్లు, రైతులు పాల్గొన్నారు. ఇందులో రూ.92 కోట్లతో ఆలయం చుట్టూ ప్రాకారాన్ని నిర్మిస్తారు. 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వం శ్రీవారి ఆలయాన్ని రూ.185 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయగా 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా.. దానిని రూ.36 కోట్లకు కుదించింది. తాజాగా అధికారంలోకి వచ్చిన కూటమి.. ఆలయాన్ని 2014-19 నాటి ప్రణాళికను మించి సకల హంగులతో అభివృద్ధి చేసేందుకు అడుగు ముందుకేసింది.

# స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి



నిజామాబాద్,స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి పిలుపునిచ్చారు. అలాగే 29న నిర్వహించే దీక్షా దివస్' ను విజయవంతం చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం అధికార పార్టీ తంటాలు పడుతోందని, బీసీ రిజర్వేషన్లు ఇవ్వడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. 42 శాతం ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ చివరికి పంచాయతీ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా లేకుండా చేసిందని ధ్వజమెత్తారు. ఇది ముమ్మాటికీ బీసీలకు ద్రోహం చేయడమేనని దుయ్యబట్టారు. ఆరు గ్యారెంటీలను అమలుచేయలేక, ఎన్నికలకు వెళ్లే ధైర్యంలేక న్యాయస్థానం చెప్పేవరకు చేసుకుందని విమర్శించారు. అందుకే పార్టీ గుర్తులు లేని పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తోందని, ఎవరు గెలిచినా తమవాళ్లే అని చెప్పుకోవడం కోసం ఈ తతంగం చేస్తోందని ధ్వజమెత్తారు. ఉమ్మడి జిల్లాలో గులాబీ పార్టీకి మంచి పట్టుందని, స్థానిక ఎన్నికలతో పాటు మళ్లీ అసెంబ్లీ ఎన్నికలొచ్చినా గులాబీ జెండా ఎగరడం ఖాయమని తేల్చిచెప్పారు. 29న జరిగే దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రెండేళ్లలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసిన మోసపు హామీలను అలాగే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గత పదేండ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక ఎన్నికల్లో ఓట్లను అభ్యర్థించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి హామీలు అమలు చేయక పోవడంతో ప్రజలు తీవ్ర ఆగ్రహంగా ఉన్నారన్నారు. రైతుల ధాన్యం కొనుగోలు చేయకుండా లారీకి 1.5 క్వింటాలు కోతలు పెట్టి వేధిస్తున్నారన్నారు. కేసీఆర్ 18 ఏండ్లు నిండిన ప్రతి మహిళకు బతుకమ్మ చీరెలను పంపిణీ చేశారని, రేవంత్ ప్రభుత్వం మాత్రం సంఘబంధ సభ్యులకే చీరెలు పంపిణీ చేస్తుండడంతో మహిళలు గ్రామాల్లో నిలదీయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికలకు కాలయాపన చేయడంతో గ్రామాలు నిర్వీర్యం అయ్యాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల సర్వేలో బీఆర్ఎస్ పార్టీకే ప్రజలు మొగ్గు చూపుతున్నట్లు తేలిందన్నారు. పార్టీ శ్రేణులంతా ఐక్యమత్యంగా పనిచేసి బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించు కోవాలని పేర్కొన్నారు.

# రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి రాక్షస పాలన



హైదరాబాద్,రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి రాక్షస పాలన కొనసాగుతుందని, రాజ్యాంగాన్ని అవహేళన చేస్తూ చట్టంలోని నిబంధనలను బేఖాతరు చేసి కాంగ్రెస్ నేతలు దుశ్చర్యలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కొనసాగేది ప్రజా పాలన కాదని.. ప్రజా ప్రతీకార పాలన.. పోలీసు రాజ్యమని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి అనుచరులు మంత్రి సురేఖ ఓఎస్డీ సుమంత్ తో కలిసి దక్కన్ సిమెంట్ యజమానులను గన్నుతో బెదిరిస్తే వారిని కాపాడేందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సీపీకి లేఖ రాయగా రాత్రికి రాత్రే మంత్రి ఉత్తమ్, సీఎం రేవంత్‌లు టాస్క్‌ఫోర్స్ పోలీసులను మంత్రి సురేఖ ఇంటికి పంపించిన విషయం వాస్తవం కాదా ఆయన ప్రశ్నించారు. అయినప్పటికీ సుమంత్ ని అరెస్ట్ చేయలేదన్నారు.అలాంటప్పుడు చేయని నేరానికి అకారణంగా ఐదు రోజులు కర్ల రాజేశ్ పోలీసుల రిమాండ్‌లో ఉంటే ఈ నియోజకవర్గానికి బాధ్యత వహించే మంత్రి ఉత్తమ్ ఎందుకు లేఖ రాయలేదని ఆయన విమర్శించారు. ఆర్టికల్ 21 ప్రకారం రాజేశ్‌ని ఎందుకు కాపాడలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో పేదల జీవితాలు లాకప్‌లోనే తెల్లారుతున్నాయన్నారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్ పేరు చెప్పాలని రాజేశ్‌ను పోలీసులు చిత్రహింసలు పెట్టారని అందువల్లే ఆయన మృతి చెందారన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఎత్తిపోతల పథకానికి రూ.5 కోట్ల ప్రాజెక్టును రాత్రికి రాత్రే రూ.50 కోట్లకు పెంచడం అవినీతి కాక మరేమిటన్నారు. ఏమాత్రం ప్రణాళిక లేకుండా కొడంగల్ నారాయణపేట ప్రాజెక్ట్‌కు రూ.4 వేల కోట్లు కేటాయించారని ఈ అంశంలో సీఎం రేవంత్ రెడ్డిని ఎందుకు అరెస్ట్ చేయలేదన్నారు. ఎస్ఎల్‌బీసీ దుర్ఘటనలో 8 మంది సజీవ సమాధి అయ్యారని, ఇందుకు మంత్రి ఉత్తమ్‌పై కేసు పెట్టలేదన్నారు. రాజేశ్‌కు నేర చరిత్ర లేదని అతనొక్కడే కుటుంబానికి ఆధారమని, త్వరలో ఇల్లు నిర్మాణం చేయిస్తానని తెలిపారు.న కుమారుడి ఆరోగ్యం బాగాలేదని రాజేశ్ తల్లి ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్తానని పోలీసుల ఎదుట నెత్తి నోరు బాదుకున్నప్పటికీ పోలీసులు వినలేదని, నాణ్యమైన వైద్యం అందించకుండా చంపారని తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆయనను అప్రూవర్‌గా తీసుకుని కేసును విచారించాల్సింది పోయి ఏకంగా చంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని జీవించే హక్కును కాపాడుతానని చెబుతుంటే సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ప్రతిరోజు ప్రజా పాలన ఇందిరమ్మ పాలన అంటూ పేదలను చంపుతున్నారని, జీవించే హక్కును కాలరాస్తున్నారని మండిపడ్డారు. చేవెళ్ల సాక్షిగా దళితులను బాగా చూసుకుంటామని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో వాగ్దానం చేయించి ఈరోజు ప్రాణాలు తీస్తున్నారన్నారు. ,292 ఎకరాల భూమిని ఆగమేఘాల మీద పాలసీ పేరుతో రూ.5 లక్షల కోట్ల కుంభకోణం చేసి ఆ భూమిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంబంధికులకు కట్టబెట్టారన్నారు. కావాలనే రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీకి చెందిన పేద వర్గాల అధికారులను ఏసీబీ అధికారులు అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేస్తున్నారని పేర్కొన్నారు. బడుగు వర్గాల అధికారులపై ఏసీబీ అధికారులు అక్రమ కేసులు బనాయిస్తుంటే ఆ సామాజిక వర్గాలకు చెందిన మంత్రులు అడ్లూరి భట్టి, వివేక్, రాజనర్సింహ ఏం చేస్తున్నారని దుయ్యబట్టారు.

## ప్రశాంతంగా పంచాయితీ ఎన్నికల నిర్వహణ

హైదరాబాద్,రాష్ట్రంలో జరగబోయే పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని స్థాయిల పోలీస్ అధికారులు కృషి చేయాలని రాష్ట్ర డిజిపి బి. శివధర్ రెడ్డి ఆదేశించారు. ఎన్నికల నిర్వహణపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ కమిషనరేట్ మినహా, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పోలీస్ కమిషనర్లు, జిల్లాల ఎస్పీలు మొదలుకొని స్టేషన్ హౌస్ ఆఫీసర్ల స్థాయి వరకు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ పోలీస్ కమిషనర్లు, జిల్లాల ఎస్పీలు గ్రామీణ ప్రాంతాల్లో జరిగే పంచాయతీ ఎన్నికలు సజావుగా, ఎలాంటి అవాంతరాలు లేకుండా జరిగేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికలను నిస్పాక్షికంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని,ఆరోపణలకు ఆస్కారం ఇవ్వకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో శాంతి భద్రతల అదనపు డీజీపీ మహేష్ ఎం భగవత్, మల్టీ జోన్ 2 అడిషనల్ డీజీపీ డీఎస్ చౌహాన్, మల్టి జోన్- 1 ఐజీపీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి, ఏఐజీ రమణ కుమార్,

# బలమైన కుటుంబాలను వదులుకుంటున్న జగన్!

అమరావతి,ఏపీలో బలం పెంచుకునేందుకు జగన్మోహన్ రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రజల్లోకి వచ్చేందుకు సిద్ధపడుతున్నారు. ఇది మంచిదే అయినా.. ఇప్పటివరకు తనకు అండగా నిలిచిన బలమైన కుటుంబాలను వదులుకోవడం మాత్రం నిజంగా ఆయనకు లోటు. ఎందుకంటే ఆయన పార్టీ ప్రకటించినప్పుడు మంత్రి పదవులు వదులుకున్న వారు ఉన్నారు. కాంగ్రెస్ పార్టీతో ఉన్న దశాబ్దాల బంధాన్ని వదులుకున్న వారు ఉన్నారు. అయితే ఇప్పుడు వారంతా జగన్మోహన్ రెడ్డి వైఖరితో విసిగి వేసారి పోయి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పేందుకు సిద్ధపడుతున్నారు. ఇప్పటికే చాలామంది వెళ్లిపోయారు కూడా. అయితే ఎవరు వెళ్లిపోయిన డోంట్ కేర్ అన్నట్టు జగన్మోహన్ రెడ్డి ఉన్నారు. వారిని ఆపే ప్రయత్నం చేయలేదు. తాజాగా నెల్లూరుకు చెందిన మేకపాటి కుటుంబం సైతం బయటకు వెళ్లిపోయేందుకు సిద్ధపడుతున్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే వారిని అడ్డుకుంటారా? లేదా? అన్నది చూడాలి.

సుదీర్ఘ రాజకీయ నేపథ్యం..

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో మేకపాటి కుటుంబం సుదీర్ఘకాలం రాజకీయం చేసింది. ముక్కు సూటితనంతో పాటు ప్రజల్లో మంచి పేరు ఉంది ఆ కుటుంబానికి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి జగన్ వెంట కుటుంబం ఉంది. రాజశేఖర్ రెడ్డి పై ఉన్న అభిమానంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో అడుగులు వేసింది. అందుకు తగ్గట్టుగానే ఆ కుటుంబానికి ఎనలేని ప్రాధాన్యం ఇచ్చారు జగన్మోహన్ రెడ్డి. మేకపాటి రాజమోహన్ రెడ్డికి రాజ్యసభ పదవి ఇవ్వగా.. ఆయన కుమారుడు గౌతమ్ రెడ్డికి మంత్రి పదవి ఇచ్చి గౌరవించారు. అయితే గౌతమ్ రెడ్డి మరణం తర్వాత మేకపాటి కుటుంబం విషయంలో జగన్ సరైన న్యాయం చేయలేదన్న టాక్ ఉంది. ఆ కుటుంబానికి రాజకీయంగా ప్రోత్సహించలేదన్న విమర్శ సైతం మూటగట్టుకున్నారు జగన్.

నెల్లూరులో వైసీపీకి బలం..

నెల్లూరు జిల్లాలో పేరు మోసిన రాజకీయ కుటుంబాలు చాలా ఉన్నాయి. అయితే ఆ కుటుంబాలన్నీ జగన్మోహన్ రెడ్డి( %ా జీుస్తుఖుఅ వీశీష్త్రుఖుఅ =వ౧ఎఎ% ) పట్ల ఆదరణ కనబరచడంతో 2014, 2019 ఎన్నికల్లో నెల్లూరు జిల్లాలో ఏకపక్ష విజయం సాధించింది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ. అయితే నెల్లూరు జిల్లాలో కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి లాంటి వాళ్లు జగన్మోహన్ రెడ్డి పై ఈగ వాల నిచ్చేవారు కాదు. ఆపై మేకపాటి కుటుంబం దూకుడుగా లేకపోయినా తెర వెనుక జగన్మోహన్ రెడ్డికి అండగా నిలిచేది. అయితే ఇటువంటి పరిస్థితుల్లో వీరందర్నీ కాదని అనిల్ కుమార్ యాదవ్ లాంటి నేతను ప్రోత్సహించారు జగన్మోహన్ రెడ్డి. దీంతో జగన్ వైఖరి నచ్చక వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి లాంటి నేతలు బయటకు వెళ్లిపోయారు. వెళ్తూ వెళ్తూ వైసిపి బలాన్ని తీసుకెళ్లిపోయారు. ప్రస్తుతం మేకపాటి కుటుంబం మాత్రమే నెల్లూరు జిల్లాలో పెద్దదిక్కుగా కనిపిస్తోంది. ఆ కుటుంబం సైతం ఇప్పుడు టిడిపిలో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.



జగన్ చుట్టూ కోటరీ పై విమర్శలు..

మొన్న ఆ మధ్యన మేకపాటి రాజమోహన్ రెడ్డి కీలక ప్రకటన ఒకటి చేశారు. కోటరీ ఉందని.. వారంతా జగన్మోహన్ రెడ్డి భజన చేస్తున్నారని.. ఆయనకు వాస్తవాలు తెలియనివ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటినుంచి మేకపాటి రాజమోహన్ రెడ్డి చుట్టూ ప్రచారం ప్రారంభం అయింది. త్వరలో ఆయన పార్టీ మారుతున్నారని కూడా టాక్ నడిచింది. అయినా సరే జగన్మోహన్ రెడ్డి నుంచి సరైన రెస్పాన్స్ రాకపోవడంతో.. పార్టీకి గుడ్ బై చెప్పేందుకు మేకపాటి అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

## మరో గ్రామం ఏకగ్రీవం..

ఆదిలాబాద్, తెలంగాణ పల్లెల్లో ప్రజాస్వామ్య ఎన్నికల సందడి మొదలైంది. గ్రామ పంచాయతీ ఎన్నికల పక్రియ అధికారికంగా ప్రారంభం కావడంతో రాష్ట్రం మొత్తం ఎన్నికల వాతావరణం లోకి ప్రవేశించింది. దీనితో సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల స్వీకరణ పక్రియ ప్రారంభమయ్యింది. నామినేషన్ రోజు మరో సర్పంచ్ ఏకగ్రీవమయ్యారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని తేజపూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానం ఏకగ్రీవమైంది. సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులను సైతం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తేజపూర్ గ్రామపంచాయతీకి పరిధిలోని సాలెగుడా, డోబ్బిగూడ , తేజపూర్ గ్రామ పటేల్‌ల ఆధ్వర్యంలో సమావేశమై స్వచ్ఛందంగా ఎన్నికలు నిర్వహించకుండా కోవా

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com